

సెల్‌లో.. బందీ

ఇదో వ్యసనం.. ఒంటరితనం.. మనోవైకల్యం

సెల్‌ఫోన్.. ఏ ముహూర్తాన వచ్చిందో కాని, ప్రతి ఒక్కరిని బానిసలను చేసుకుంది. వ్యసనంగా మార్చేసింది. మద్యం మత్తు గంటకో.. రెండు గంటలకో వదుల్తుంది. కాని సెల్ మత్తు నిద్రపోయినా వదలడం లేదు. ఇది అందరి జీవితాలను శాసిస్తోంది.

పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు 'సెల్ మా లోకం'లో బతుకుతున్నారు. పిల్లలు మారాం చేస్తే.. సెల్ ఫోన్ ఇచ్చేసి పేరెంట్స్ ఆ బాధ నుంచి తప్పించుకుంటున్నారు. వృద్ధుల విషయంలోనూ ఇదే ధోరణి.

ఇక ప్రతి ఐదు నిమిషాలకు ఒక్కసారైనా సెల్ ఫోన్ మీద చెయ్యి వేయకపోతే ఏదో కోల్పోయామన్న బాధ. పది నిమిషాలకు ఒక్కసారైనా వాట్సప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూ ట్యూబ్‌ల్లో ఏదో ఒకటి చూడందే మనసు స్థిమితం ఉండడం లేదు.

తింటున్నా, తాగుతున్నా.. బైక్ నడుపుతున్నా.. టీవీ చూస్తున్నా చేతిలో సెల్‌ఫోన్ ఉండాలి.

రాత్రి మంచంపై దిండు, దుప్పటి లేకపోయినా.. సెల్‌ఫోన్‌కు స్థానం ఇస్తున్నాం. దీనికి అంతలా బందీలమైపోయాం.

ఈ తీరు మార్చుకోకపోతే.. ఆలోచించే శక్తిని కోల్పోయి.. ఒంటరితనం, మనోవైకల్యం రావడం ఖాయం. మితంగా వాడితేనే ఏదైనా ఆనందం. వికాసం. లేకుంటే అదొక రోగం!



6

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్



సాఫ్ట్‌వేర్.. స్లో



- కనిపించని ఉద్యోగావకాశాలు..
- ఇంజనీరింగ్ విద్యార్థుల గగ్గోలు
- ప్రాజెక్టులు పూర్తయితే.. కంపెనీల్లో ఉద్యోగాలు ఊడినట్లే!
- జిల్లాలో ఏటా 10 వేల మంది ఇంజనీరింగ్ అభ్యర్థులు బయటకు
- రెండేళ్లుగా 10 శాతం దాటని ప్లేస్‌మెంట్స్.. ఇప్పుడేం చేయాలి?
- విద్యార్థుల్లో తగిన నైపుణ్యం లేకపోవడమూ కారణమే

7

దరఖాస్తు గడువు పొడిగింపు

ఏలూరు అర్బన్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : బుట్టాయిగూడెం మండలం బూసరాజుపల్లిలోని పీఎంకే ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగావున్న ఎయిడెడ్ ఎస్జీటీ పోస్టు భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించే గడువును డిసెంబరు ఒకటో తేదీ వరకు పొడిగించినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అన్ని ధ్రువీకరణ పత్రాల ఫొటోస్టాట్ కాపీలను జతచేసి దరఖాస్తులను నిర్ణీత గడువు తేదీలోగా స్కూలు యాజమాన్యానికి వ్యక్తిగతంగా లేదా పోస్టుద్వారా లేదా సీఎస్ఈ వెబ్‌సైట్‌ద్వారాగాని పంపాలని కోరారు.

సెలవులపై ఆంక్షలొద్దు

ఏలూరు అర్బన్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 10 శాతం మించి సెలవులు మంజూరు చేయరాదని ఎంఈవోలు, హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ పీఆర్టీయూ జిల్లా నాయకులు ఆంజనేయులు, మొహిద్దీన్ పాషా శనివారం డీఈవో వెంకట లక్ష్మమ్మకి వినతి పత్రాన్ని అందజేశారు. అనారోగ్య సమస్యలు, ఇతర అత్యవసర ఇబ్బందులతో బాధపడుతున్న ఉపాధ్యాయులు ఈ ఉత్తర్వుల వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో పునరాలోచించి పాఠశాల పరిపాలనకు ఇబ్బందులు లేకుండా సంబంధిత విద్యాధికారులు సెలవులు మంజూరు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని డీఈవోని కోరారు.

ధాన్యం అమ్మిన నాలుగు గంటల్లోపే సొమ్ము జమ

ముదినేపల్లి, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): ధాన్యం అమ్మిన సొమ్ము గంటల వ్యవధిలోనే ప్రభుత్వం నుంచి నగదు జమ కావడంతో రైతులతోపాటు కౌలు రైతులకు ఆనందం కలిగిస్తోంది. చిగురుకోట గ్రామానికి చెందిన కుంచె నాగబాబు అనే కౌలు రైతు ఈ నెల 22న ఉదయం 10 గంటలకు సుమారు 6 టన్నుల ధాన్యాన్ని స్థానిక రైతు సేవా కేంద్రం ద్వారా పెదగొన్నూరు ఏరియాలోని రైసుమిల్లుకు విక్రయించగా, అదే మధ్యాహ్నం 2 గంటలకే సొమ్ము బ్యాంకు ఖాతాకు జమ అయినట్టు ఫోన్‌కు మెస్సేజ్ వచ్చింది. ధాన్యం అమ్మిన కొద్ది గంటల్లో సొమ్ము చేతికి అందడం పట్ల కౌలు రైతు నాగబాబు ఆనందం వ్యక్తం చేశాడు.

తల్లీ కొడుకు దారుణ హత్య

7

వైసీపీకి జయమంగళం

వైసీపీలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలో ఉన్న ఆ పార్టీ ఏకైక ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కూడా గుడ్‌బై చెప్పారు. ఎమ్మెల్సీ పదవితో పాటు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇప్పటికే ఏలూరు జిల్లాలో వైసీపీ పూర్తిగా దిగజారిన పరిస్థితుల్లో వెంకటరమణ తన పదవికి రాజీనామా చేయడం వైసీపీకి ఒక బిగ్ షాక్.

ఎమ్మెల్సీ, పార్టీ పదవులకు వెంకటరమణ రాజీనామా

- చాన్నాళ్లుగా పార్టీకి దూరం.. అయినా పట్టించుకోని అధి నాయకత్వం
- అప్పుడు టీడీపీ.. ఇప్పుడు జనసేన గేలం
- ఏలూరు జిల్లాలో వైసీపీకి షాక్ మీద షాక్
- ఈ స్థానం ఎవరికి దక్కేను? రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ

కొన్ని కారణాలతో వైసీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నా. నా రాజకీయ భవిష్యత్‌పై ముఖ్య అనుచరులతో సంప్రదింపులు జరిపిన తర్వాతే నిర్ణయం తీసుకుంటా.

\- మీడియాతో వెంకటరమణ



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):
చాలా కాలం నుంచి వెంకటరమణ పార్టీని వీడబోతున్నారంటూ ప్రచారం సాగుతుండగా దీనికి బ్రేక్ వేసేందుకు వైసీపీ ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. అర్ధంతరంగా జయమంగళ తన పదవిని వదులుకోలేదు. దీని వెనుక రకరకాల కోణాలున్నాయి. ఇప్పటికే వైసీపీ తన పార్టీ కేడర్‌కు దూరంగా మిగిలింది. కొద్ది మాసాల క్రితం జయమంగళతో టీడీపీ నేతలు కొందరు టచ్‌లోకి వెళ్లారు. వైసీపీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి తమ పార్టీలోకి రావాల్సిందిగా ఆయన చెవిన వేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీ ఆ తర్వాత జిల్లాల్లో పార్టీ కార్యకలాపాలు ఎక్కడా వేగిరపర్చలేదు. ఆ పార్టీ ఎమ్మెల్సీగా వున్న వెంకటరమణ పార్టీ అగ్రనాయకత్వంతోపాటు మిగతా సీనియర్లతోను మాటామంతీ లేకుండా దూరంగా ఉన్నారు. ఆయనను ఒప్పించి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయాలనే ప్రయత్నం వైసీపీలో ఒక్కరూ చేయలేదు. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి ఆళ్ల నాని నాలుగు నెలల క్రితం పార్టీకి, తన పదవులకు రాజీనామా చేసి మాయమయ్యారు. ఇదే సందర్భంలో జిల్లా అధ్యక్ష స్థానానికి కైకలూరు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పేరు నాయకత్వం ప్రతిపాదించి ఆ మేరకు ఒప్పించింది. ఇంత జరిగినా అదే నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ వెంకటరమణ విషయంలో చూసీచూడనట్టు వ్యవహరించింది.

రమణ వెనుక ప్రకాశం నేత

వెంకటరమణ రాజీనామా చేయడానికి ప్రకాశం జిల్లాకు చెందిన జనసేన నేత కీలక పాత్ర పోషించినట్టు చెబుతున్నారు. గతంలో వెంకటరమణతో టీడీపీ నేతలు చర్చించినట్టే జనసేన నేత పక్షం రోజులకు ముందే చర్చలు సాగించారు. తమ పార్టీలో చేర్చుకోవడమే కాకుండా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినందుకు సంతృప్తి కలిగించేలా తాను సాయపడతానంటూ భరోసా ఇచ్చిన తదుపరే రాజీనామాల పర్వం సాగినట్టు చెబుతున్నారు. గత ఎన్నికలకు ముందు తెలుగుదేశంలో కైకలూరు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్‌గా ఉన్న వెంకటరమణ ఆ తదుపరి వైసీపీలో చేరారు. కొల్లేరులో ఒక బలమైన సామాజికవర్గం బీసీ ప్రతినిధిగా రమణకు వైసీపీ ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చింది. ఒకవైపు టీడీపీని దెబ్బతీయడమే కాకుండా సమాంతరంగా కొల్లేరులో రమణ సామాజిక వర్గం వారి మద్దతు దక్కుతుందన్న వ్యూహంతో వైసీపీ వ్యవహరించింది. టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లే ముందు వెంకటరమణను అప్పట్లో టీడీపీ పెద్దలు ఎవరూ ఆపేందుకు ప్రయత్నించలేదు. ఇప్పుడు వైసీపీకి రాజీనామా చేసే సందర్భంలోను వైసీపీ పక్షాన సీనియర్లు ఎవరూ చర్చలకు రాలేదు. దీంతో వెంకటరమణ కొంత అసంతృప్తి చెందడమే కాకుండా జనసేన నేత ఇచ్చిన 'హామీ'తోనే కాస్త మెత్తపడ్డట్టు సమాచారం. రాబోయే కొద్ది రోజుల్లోనే జనసేనాధిపతి పవన్‌కళ్యాణ్ సమక్షంలోనే వెంకటరమణ ఆ పార్టీలో చేరతారంటూ ప్రచారం జరుగుతోంది.

సీను మారింది

ఎమ్మెల్సీగా వెంకటరమణ కొద్ది మాసాలే కొనసాగారు. ఈ స్వల్ప కాలంలో ఆయనను టార్గెట్ చేసుకుని అన్ని పార్టీలు వ్యవహరించాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో జనసేన కోసం పార్టీ టిక్కెట్లను త్యాగం చేసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, తాడేపల్లిగూడెం నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వలవల బాబ్జీకి న్యాయం చేస్తామంటూ అప్పట్లోనే చంద్రబాబు భరోసా ఇచ్చారు. దీనికి తగ్గట్టు ఒక వేళ వెంకటరమణ ఎమ్మెల్సీ పదవి నుంచి తప్పుకుంటే ఆ ఖాళీని గన్నితో భర్తీ చేయవచ్చన్న కోణంలోనే తొలుత టీడీపీ నాయకులు ఆయనతో సంప్రదింపులు జరిపారు. ఈ విషయం లీక్ కావడంతో కొన్నాళ్లపాటు ఈ తరహా సంభాషణలకు బ్రేక్ పడింది. కైకలూరులో స్థానికంగా ఉన్న కొందరు.. ఏం చేద్దాం ఆ విషయం అంటూ పార్టీ సీనియర్లను సంప్రదించినా వ్యవహారం ముందుకు సాగలేదు. ఇదంతా గడిచి నెలన్నర రోజులైంది. ఇప్పుడు మరోమారు జనసేన ఆయన చుట్టూనే వ్యూహం నడిపింది. చివరికి అది ఫలించి రమణ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి దారితీసింది.

ఇప్పుడు ఖాళీ అయిన ఆ స్థానంలో ప్రకా శం జిల్లాకు చెందిన జనసేన నేతతో భర్తీ చేయడానికేనంటూ విస్తృత ప్రచారం సాగుతోంది. పార్టీ కోసం టికెట్ త్యాగం చేసిన గన్ని, వలవల విషయంలో మరెప్పుడు న్యాయం జరుగుతుందో తెలియడం లేదనే భావన పార్టీ వర్గాల్లో ఉంది. జనసేన కొంత దూకుడుగా వెళ్లడం, ఆ పార్టీలోవున్న ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు ఏదొక రకంగా సమయం చిక్కినప్పుడల్లా న్యాయం జరుగుతోందని, అదే తెలుగు దేశం పార్టీ విషయానికి వచ్చేసరికి అత్యధికులకు అలాంటి పరిస్థితి లేదనే అసంతృప్తి స్పష్టంగా ఉంది.

భూసేకరణ వేగవంతం చేయండి



కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు టూటౌన్/రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారులు, పరిశ్రమలకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే ఇరిగేషన్ ప్రాజెక్టులకు భూసేకరణ అంశాలపై శనివారం కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రహదారుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, చింత లపూడి లిఫ్ట్ ఇరిగేషన్ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు భూసేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో వీ.విశ్వేశ్వరరావు, ఆర్డీవోలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

హాల్‌టిక్కెట్లు, సర్టిఫికెట్లు ఇవ్వకపోతే ఫిర్యాదు చేయండి

పరీక్షలకు హాజరయ్యేందుకు హాల్‌టిక్కెట్ల జారీ, ఒరిజినల్ సర్టిఫికెట్ల అందజేత, అధిక ఫీజుల వసూళ్లపై విద్యార్థుల నుంచి ఫిర్యాదులందితే సంబంధిత కళాశాల యాజ మాన్యంపై చర్యలు తీసుకుంటామని, కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు. జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతీ విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ చార్జీలు మంజూరు చేస్తామన్నారు. విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాలను ఇవ్వాలని కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశా మని, ఈ విషయంలో విద్యార్థులకు సమస్యలు ఎదురైతే కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ నెంబరు 94910 41188కు ఫిర్యాదు చేయాలని కోరారు.

79,900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): రైస్‌మిల్లులకు వచ్చిన ధాన్యం వివరాలు సీఎంఆర్ బియ్యం వివరాలను సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేసి ఉన్నతాధి కారుల తనిఖీల సమయంలో తప్పనిసరిగా చూపించాలని, జేసీ ధాత్రిరెడ్డి మిల్లర్లను ఆదేశించారు. శనివారం ఖరీఫ్ పంట కాలానికి ధాన్యం సేకరణ , సీఎంఆర్ బియ్యం పంపిణీ, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రైస్‌మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 182.06 కోట్ల విలువైన 79,900 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు శ్రీలక్ష్మి, పౌరసరఫరాల సంస్థ అధికారి ఆర్.ఎస్.ఎస్ రాజు, విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారి దేవకీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు అంబులెన్సులపై రంగం సిద్ధం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏలూరు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రైవేటు అంబులెన్సుల నిర్వాహకులు తిష్ట వేసి రోగుల నుంచి అధిక ధరలు వసూలు వసూ దోచుకుంటున్నారంటూ 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 21న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆస్పత్రి మెడికల్ సూపరిం టెండెంట్ ఎంఎస్ రాజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రి పరిధికి 500 మీటర్ల దూరంలో ప్రైవేటు అంబులెన్సులు లేకుండా చర్యలు తీసుకుం టామని, ఇప్పటికే రెవెన్యూ రవాణాశాఖ పోలీసులకు ఫిర్యాదు చేశా మన్నారు. కలెక్టర్ గతంలో ఇచ్చిన ధరల పట్టికను ఎవరో చించివేశారని, దానిని తిరిగి ఏర్పాటు చేస్తామన్నారు. ప్రైవేటు అంబులెన్సుల దోపిడీలో ఆస్పత్రి సిబ్బంది, మహాప్రస్థానం డ్రైవర్లు సహకరించకుండా డిప్యూటీ సూపరింటెండెంట్, రెసిడెన్స్ మెడికల్ ఆఫీసర్, అత్యవసర విభాగపు వైద్యశాఖ విభాగాధిపతులతో కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేయిస్తున్నామన్నారు.

నేడు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల నమోదు

ఏలూరు రూరల్‌నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలని డీఆర్వో జి.విశ్వేశ్వరరావు ఆదేశించారు.

ఇంటర్వ్యూ..

'ఫ్రెండ్లీ టీచర్'గా ఉంటా..

డీఈవో వెంకట లక్ష్మమ్మ



ఏలూరు అర్బన్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : 'తెలుగు రాష్ట్రాల నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే బాలబాలికలు మాతృభాషలోనే పరీక్షలు రాసేందుకు వెసులుబాటు కల్పించినందున ఇక ఆందోళన చెందనక్కరలేదు. ఎంపిక చేసిన 27 హైస్కూళ్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని గంటల నిర్ణయం ఈ నెలాఖరు వరకే పరిమితం. ఏపీపీఎస్‌సీ గ్రూప్ పరీక్షల ద్వారా నియామకం పొంది ఉద్యోగకాలమంతా డైరెక్టరేట్ లోనే వివిధ బాధ్యతల్లో ఉన్నా. కొత్తగా ఏర్పడిన జిల్లాలకు డీఎస్ఈవోగా పనిచేసిన అనుభవం కేవలం రెండేళ్లు మాత్రమే. తొలిసారిగా ఉమ్మడి జిల్లా డీఈవో విధులు నిర్వహించాల్సిరావడం కొంచెం కష్టమైనా విద్యాధికారులు, ఉపాధ్యాయుల సహకారంతో జిల్లాలో విద్యాభివృద్ధి ఫలాలను సాధించేందుకు ప్రయత్నిస్తా' అంటూ ఇటీవల జిల్లా విద్యా శాఖాధికారి బాధ్యతలు చేపట్టిన వెంకట లక్ష్మమ్మ పేర్కొన్నారు. విద్యా రంగానికి సంబంధించి వివిధ అంశాలపై ఆమె మాటల్లోనే..

35 ఆధార్ సెంటర్లు

ప్రభుత్వ పథకాల లబ్ధికి, విద్యార్థి సమగ్ర సమాచారానికి చేపట్టిన అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అక్కౌంట్ రిజిస్ట్రీ) డేటా నమోదులో జిల్లా 80.57 శాతం పూర్తిచేసి రాష్ట్రంలో ద్వితీయస్థానంలో ఉంది. మిగతా వారంతా అసలు పుట్టినతేదీ లేకుండానే స్కూలులో చేరిన పిల్లలు, ఆధార్ కార్డుల్లో తప్పులున్న పిల్లలే. వీరికోసం జిల్లావ్యాప్తంగా 35 ఆధార్ సవరణ కేంద్రాలను పాఠశాలల ప్రాంగణాల్లోనే ఏర్పాటు చేయడంతో కొద్దిరోజుల్లోనే నూరుశాతం నమోదు పూర్తవుతుందన్న నమ్మకం ఉంది. విద్యార్థి ఎల్‌కేజీ చదువు నుంచి పీజీ వరకు విద్యను ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల సమాచారం వరకు మొత్తం వ్యక్తిగత ప్రొఫైల్‌గా అపార్ ఉంటుంది. పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసేటప్పుడు విద్యార్థి తన అపార్ నెంబరును నమోదు చేస్తే చాలు.

ఉచిత స్టడీ మెటీరియల్

టెన్త్ పరీక్షల విద్యార్థులకోసం ఉదయం 8.15 నుంచి 9 గంటలవరకు, సాయంత్రం 4.15 గంటల నుంచి 5 గంటలవరకు రెమిడియల్ క్లాసులు తీసుకోవాలని హెచ్‌ఎంలను, సబ్జెక్టు టీచర్లకు ఆదేశాలిచ్చాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ డీసీఈబీ ద్వారా 'విజయ కేతనం' ఉచిత స్టడీ మెటీరియల్‌ను వచ్చేనెలలో అందజేసేందుకు ప్రయత్నిస్తున్నాం. జిల్లాలోని 38 సీబీఎస్ఈ పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో స్టేట్ సిలబస్‌లోనే విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వెసులుబాటు కల్పిస్తున్నాం.

మెగా డీఎస్సీకి తొలగిన అడ్డంకి

ఉమ్మడి పశ్చిమలో 1035 ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు నోటిఫై చేయనున్నారు. వీటిలో మున్సిపల్ యాజమాన్యం నుంచి భర్తీచేయాల్సిన పోస్టుల్లో 70శాతం ఖాళీలను ఇన్‌సర్వీస్ ఎస్జీటీలకు పదోన్నతులు ఇవ్వకుండా మొత్తం పోస్టులన్నింటినీ డీఎస్సీకి చేర్చారని ఉపాధ్యాయుల ఆందోళనతో ఆ విషయాన్ని రోస్టర్ పాయింట్లతో సహా ఇటీవల పరిశీలించాం. మున్సిపల్ ఖాళీల్లో పదోన్నతి కోసం కేటాయించాల్సిన నిర్దేశిత 70 శాతం పోస్టులను డీఎస్సీలో చేర్చలేదని నిర్ధారణ అయింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ ముగిసిన వెంటనే మున్సిపల్ టీచర్లకు పదోన్నతుల కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తాం.

టీచర్లతో స్నేహపూర్వక సంబంధాలే

జిల్లాలో మొత్తం 7,650 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరితో స్నేహపూర్వక సంబంధాలనే కోరుకుంటున్నా. ఈ నెలాఖరులోగా టెన్త్ సిలబస్‌ను పూర్తి చేయాలని కోరాం. డిసెంబరులో జిల్లా సైన్స్ ఎగ్జిబిష న్‌ను నిర్వహిం చనున్నాం. జీఎంసీ బాలయోగి సైన్స్ మ్యూజియంను రూ.40 లక్షలతో నవీకరణ పనులు పూర్తి చేసి తిరిగి వినియోగంలోకి తీసుకొస్తాం.

వేంపాడు మేజర్ ఆయకట్టుకు

సాగర్ జలాలు చేరేనా?

- వైసీపీ హయాంలో కనీస మరమ్మతులు లేవు
- శిథిలావస్థకు చేరిన వేంపాడు మేజర్ కాల్వ



చాట్రాయి, నవంబరు 23: నాగార్జున సాగర్, వేంపాడు మేజర్ ఆయకట్టుకు రబీలో సాగర్ జలాలు వచ్చేనా? లేదా? అని రైతులు ఆశ నిరాశలతో ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కనీస మరమ్మతులు చేయకపోవడంతో కాల్వలో చెట్లు, జమ్మి పెరిగి, భారీ వర్షాలకు గాళ్ళు పడి శిథిలావస్థకు చేరి నీరు నడిచే పరిస్థితి లేకుండా ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ పరిధిలో జోన్-3లో వేంపాడు మేజర్ కాల్వ ఉంది. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం రామచంద్రపురం 21 బ్రాంచ్ కెనాల్ వద్ద ప్రారంభమై ఏలూరు జిల్లా చాట్రాయి, ముసునూరు, నూజివీడు, బాపులపాడు, పెదపాడు మీదుగా పెదవేగి మండలంలో ముగుస్తుంది. మొత్తం కాల్వ పొడవు 53 కిలోమీటర్లు కాగా ఆయకట్టు 36 వేల ఎకరాలు ఉంది. రబీ పంటలకు డిసెంబరులో నీరు విడుదల చేయాల్సి ఉండగా, ఇంకా ఎన్నెస్పీ అధికారులు కాల్వకు తాత్కాలిక మరమ్మతులపై దృష్టి సారించలేదు. వేంపాడు మేజర్ ఆయకట్టు కింద రబీలో ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. చెరువుల్లో సాగర్ జలాలు నింపితే భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగి రబీ పంటకు ఢోకా ఉండదని రైతులు భావిస్తుండగా, వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఉండవని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం వేంపాడు మేజర్ కాల్వకు మరమ్మతులు చేయించి ఆయకట్టుకు సాగర్ జలాలు విడుదల చేయాలని రైతులు ప్రజలు కోరుతున్నారు. 'ఎన్నెస్పీ వేంపాడు మేజర్ కాల్వకు అవసరమైన చోట్ల తాత్కాలిక మరమ్మతులు చేసి నీటి సరఫరాకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూస్తాం. డిసెంబరు 1 నుంచి నీరు విడుదలకు చర్యలు తీసుకుంటా'మని ఈఈ కె.గోపీనాథ్ తెలిపారు.,

సాగర్ జలాలు విడుదల చేయాలి



ఎన్నెస్పీ వేంపాడు మేజర్ కాల్వకు సాగర్ జలాలు విడుదల చేస్తే రబీ పంటలు పండటంతో పాటు, వేసవిలో తాగు నీటి ఇబ్బందులు తీరతాయి. ప్రభుత్వం స్పందించి నీరు విడుదలకు చర్యలు తీసుకోవాలి

\- కలకొండ భాస్కరరావు, రైతు, జనార్ధనవరం

మూలకు చేరిన కియోస్క్ యంత్రాలు


కత్తవపాడులో రైతు భరోసా కేంద్రంలో పనిచెయ్యని కియోస్క్

రైతుల కోసమని గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో లక్షలు వెచ్చించి కియోస్క్ యంత్రా లను ఏర్పాటు చేశారు. ఇవి ఇప్పుడు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఎరువుల, విత్తనాలు బుకింగ్ చేసకోవడంతో పాటు మార్కెట్ ధరలు, ఉద్యాన పంటలు తదితర సేవల సమాచారం తెలుసు కునేందుకు గ్రామానికి ఒక డిజిటల్ కియోస్క్ యంత్రం ఏర్పాటు చేశారు. అయితే ఈ యంత్రాన్ని వినియోగించే పరిజ్ఞానం రైతులకు లేకపోవడంతో గ్రామ వ్యవసాయ సహాయకులు సహకారంతో తెలుసుకునేవారు. ఈ యంత్రం వచ్చిన సంవత్సరంలోపే ఇందులోని సేవలు సెల్‌ఫోన్‌లో కూడా రావడంతో వీటి వినియోగం తగ్గిపోయింది. ఫలితంగా లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన యంత్రాలు నిరుప యోగంగా మారాయి. దీని విలువ రూ.75 వేలు పైనే ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు. ఇరగవరం మండలంలో 21 కియోస్క్ యంత్రాలు ఉండగా ఒకొక్కటిగా మూలకు చేరుతున్నాయి.

- ఇరగవరం

స్వామీ..కనవేమి..




చిరిగిన చొక్కా.. చేతిలో కోతిపిల్ల.. ఒంటి నిండా రంగు వేసుకుని...గాంధీ వేషం.. బడి బాట పట్టాల్సిన వయసులో ఈ ఇద్దరు పిల్లలు బిక్షాటన కోసం గుడిబాట పట్టారు.. బిక్షాటన చేస్తూ కుటుంబ పోషణలో భాగస్వాముల వుతున్నారు.. కోతిపిల్లను పట్టుకుని ఒక ఊరి నుంచి మరో ఊరుకు తిరిగే వలస కుటుంబా లకు చెందిన ఈ బాలుడు శనివారం ద్వారకా తిరుమల క్షేత్రంలో భక్తులను బిక్షం అడు గుతూ కనిపించాడు.. గాంధీ వేషం వేసుకుని వచ్చి వెళ్లే భక్తులను సాయం చేయమంటూ దీనంగా వేడుకుంటున్నాడు.. చదువుకోని పిల్లలను బడిలో చేర్చుతామని అధికారులు చేస్తున్న ప్రకటనలు ప్రచారానికే కానీ వాస్తవంలో కాదని పలువురు అంటున్నారు..

-ద్వారకాతిరుమల

గో సంరక్షణ దాసుడు

ఆపదలో ఉన్న గోవులకు రక్షకుడు సుంకర దాసు

వెయ్యికి పైగా మృతి చెందిన జీవాల ఖననం




భీమవరం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హిందువులకు గోవు ఎంతో పవిత్రమైనది. గోవు కనిపిస్తే చాలు నమస్కరిస్తాం. తాకి ఆనంద పడతాం. భీమవరానికి చెందిన సుంకర దాసు ఆపదలో ఎక్కడైనా గోవు ఉందని సమాచారం అందితే అక్కడకు చేరుకుని దానికి అవసరమైన వైద్యం సహాయం అందించి రక్షిస్తారు. ఇప్పటి వరకు దాదాపు వెయ్యికిపైగా మృతిచెందిన గోవులను ఖననం చేశారు. 2016లో గునుపూడిలో గోవు గాయపడి కనిపిస్తే దానికి సపర్యలు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా దానికి మంచి స్పందన వచ్చింది.. అప్పటి నుంచి ఎక్కడైనా గోవులు ఇబ్బందుల్లో ఉంటే మొదటి ఫోన్ దాసుకే వస్తుంది. చివరకు కాకినాడు, హైదరాబాద్, అనంతపురం నుంచి గోవుల గురించి ఫోన్‌లు వచ్చిన సంఘటనలు ఉన్నాయి.



" చిన్నప్పటి నుంచి గోవులు అంటే ఎంతో ఇష్టం.. ఎవరి దగ్గర ఒక్క రూపాయి సాయం తీసుకోను...అంతా నా సొంత ఖర్చులతోనే చేస్తున్నాను... స్నేహితులు అశోక్ యాదవ్, వెలమ మణి, కళ్యాణ్, ఇలా ఎంతోమంది సహకారం అందిస్తున్నారు. పశువైద్యులు కూడా ఎంతో సహకారం అందిస్తున్నారు. వారి సహకారం లేకపోతే గోవులకు సరైన వైద్యం అందించలేను. నేనే చేస్తున్న గో సేవను చూసి జిల్లాలో ఉన్న జంతు సంరక్షణ కమిటీలో ఉపాధ్యక్షుడిగా నియమించారు.యజమానులు వీటిని బయటకు వదలి వెయ్యడం వల్ల వాటికి ప్రమాదాలు జరుగుతున్నాయి అంతే కాక ప్లాస్టిక్ కవర్లు బయట పడవెయ్యటం వల్ల అందులో ఉన్న పదార్థాల కోసం ఆవులు, దూడలు కవర్లతో పాటు తిని అనారోగ్యానికి గురై ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నాయి. ఎన్నో సార్లు పోలీసులకు, అధికారులకు బయట గోవులు తిరగ కుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాలు ఇచ్చాను.. మొదట్లో స్పందన ఉండేది తరువాత మళ్ళీ మామూలే. దీనిపై గట్టి చర్యలు తీసుకుంటే గో ప్రమాదాలను నివారించవచ్చని" దాసు చెబుతున్నారు..

సెల్ మాయాలోకం



ఆప్యాయంగా పిలిచే మాటలు లేవు. పలకరింపులు అసలే లేవు, పరామర్శలు అంతకంటే లేవు. ఇప్పుడు ఎక్కడ చూసినా మొబైల్ పలకరింపులు. అప్‌డేట్ అంటూ పాత, కొత్తతరం మొబైల్ ఫోన్‌లలోనే మునిగి తేలుతున్నారు. దీనికి చిన్నా పెద్దా, ఆడా మగా తేడా ఏమీ లేదు.. అంతటా సెలఫోన్ రాజ్యమే.. ఇంటి యజమానికి మంచినీరిచ్చే దిక్కులేదు.. పిల్లలకు చదువు చెప్పే తీరిక లేదు.. కాస్త మంచీ చెడూ చెప్పే పెద్దలదీ ఇంచుమించే ఇదే తీరు.. అంతలా సెలఫోన్ మాయాజాలంలో బందీ అయిపోయారు..బంధాలకు దూరమయ్యారు...

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరుకు చెందిన సుబ్బారావు ఇంట్లో ఐదుగురు ఉంటారు. వీరందరి చేతుల్లోనూ తలకో ఫోన్. ఒకరికొకరు ఎదుట పడి మాట్లా డుకోవడం ఎప్పుడో పోయింది. రాత్రి పొద్దుపోయేంత వరకు సెల్ లోనే మునిగి తేలతారు. దీనికోసం వీరంతా ప్రతీనెలా పెట్టే ఖర్చు సుమారు రెండు వేల రూపాయలు. మధ్య తరగతి కుటుంబమైనా ఇంత ఖర్చు భరించాల్సిందే. మధ్యమధ్యలో నెట్ కోసం మరో పదో పరకో తప్పదు.

తాడేపల్లిగూడేనికి చెందిన సుబ్రహ్మణ్యం ఒక చిరుద్యోగి.. చదువుకునే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయనకు ఉద్యోగం కాబట్టి ఫోన్ తప్పదు.. సమాచారం కోసం ఇంటావిడకు కూడా మరో ఫోన్.. వీళ్ల ఫోన్లు ఖాళీ ఉండవు కాబట్టి పిల్లలకోసమని ఇంకో ఫోన్.. ఫోన్లు సరే.. వాటి రీచార్జిలకు నెలనెలా సొమ్ములవుతాయి కదా.. పొద్దస్తమానూ చాకిరీ చేసి ఇంటికొస్తే అంతా సెల్‌ఫోన్లతో యమా బిజీగా ఉంటారు.. కాస్త మంచినీరు ఇచ్చే దిక్కు కూడా లేదని వాపోవడం తప్ప ఏం చేయగలడు..

రోజంతా కాయకష్టం చేసిన వారి దగ్గర నుంచి ఇంట్లో ఇల్లాలు వరకు ఇప్పుడు అందరి చేతి లోనూ సెల్‌ఫోన్‌లే. అడుగుతీసి అడుగేయాలంటే ఫోన్ ఉండాల్సిందే.. ఏది కొనాలన్నా, చెప్పాలన్నా, బెదిరించాలన్నా, బామాలాడాలన్నా సెల్ చేతిలో ఉండాల్సిందే. అంతలా సెల్ బానిసలయ్యారు జనం. రోజువారి పనులను కూడా వాయిదా వేసుకుంటున్నారు.చంటి పిల్లలు కూడా ఇప్పుడు మొబైల్ బొమ్మలకు అలవాటుపడ్డారు. చిన్న పిల్లలు మారాం చేస్తుంటే కాస్త గదమాయించాల్సింది పోయి.. వారి చేతుల్లోనే మొబైల్ ఉంచి సరిపుచ్చుకుంటున్నారు. పాడైపోతారంటూ పిల్లలను గదమాయించే పెద్దలంతా 24 గంటలు సెల్ కబుర్లు. ఆచార సంప్రదాయాలు, పలకరింపులు, ధైర్యం చెప్పడం, తప్పు చేస్తుంటే.. తప్పు కన్నా అంటూ సున్నితంగా హెచ్చరించే అలవా ట్లన్నీ క్రమేపీ మారిపోతున్నాయి. ఇది కాస్తా చిన్నప్పటి నుంచే వ్యసనంగా మారుతుంది. రానురాను చదువు, సంధ్య పక్కనపెట్టి సెల్ పుణ్యమా అంటూ కొందరు అసమర్ధుల వుతున్నారు. ఈ మధ్యకాలంలో స్కూలు వయసులోనే సెల్ కోసం డిమాండ్ చేయడం పెద్దలపై ఒత్తిడి తెచ్చి మరీ సాధించడం చేస్తున్నారు. పాఠశాలలు ఎగ్గొట్టి కొందరు విద్యార్థులు బయట ప్రాంతాల్లో సెల్‌తో కాలక్షేపం చేస్తున్నారు.ఇలాంటి విపత్కర పరిస్థితి నుంచి పిల్లలను బయట పడేద్దామనుకుంటున్న తల్లిదండ్రులకు అది సాధ్యం కావడం లేదు. అంతలా సెల్ మయమైంది.

సెల్‌ఫోన్ లేనిదే క్షణం గడవదు
మూకుమ్మడిగా మునిగి తేలుతున్నారు
ఇంట్లో సమస్యలు ఎవరికీ పట్టవు
మాటామంతి ఎప్పుడో మాయం
ఒంటరితనం..
మనోవైకల్యంతో ఇబ్బందులు
చంటి పిల్లలకు కూడా ఇదే పెద్ద బూచి
మారుతున్న కాలమంటూ సెల్‌చల్
డబ్బుపోయే.. సమయం పోయె..

కోరి తెచ్చుకున్న ఒంటరితనం

ఈ మధ్యకాలంలో సెల్‌ఫోన్ చేసే గాయాలు అన్నీ ఇన్నీ కావు. లోతుగా గమనిస్తే చాలా మంది నలుగురితో కలవడం మానేశారు. యోగ క్షేమాలు అడగడం ఏనాడో మరిచిపోయారు. కనీసం కుటుంబ నేపథ్యం గురించి, బాగోగులు గురించి ఏ ఒక్కరూ పట్టించుకోకపోగా హాయ్ అంటూనే పక్కకు జరిగిపోతున్నారు. చాటింగ్‌లు, వీడియో రీల్స్, అనవసర విషయాల్లో చర్చలు, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల్లో ప్రమోట్ అయ్యేందుకే ఇష్టపడుతున్నారు. మంచి, చెడ్డ ఇక్కడ ప్రస్తావనే లేదు. ఉదాహరణకు ఇంటికి ఎవరైనా చుట్టాలు వచ్చినా చూద్దామని స్నేహి తులు వచ్చినా దూర ప్రాంతాల నుంచి అయిన వారు వచ్చినా కనీసం వారితో పలకరింపులు కరువే. ఎప్పుడొచ్చారనే అనే ముక్తసరి ప్రశ్నతోనే సరిపెట్టేస్తున్నారు. అంతకంటే మించి వారితో కూర్చొని మాట్లాడేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. ఎవరినైనా పరామర్శించాలన్నా వీడియో కాల్స్‌లో సరిపెట్టేస్తున్నారు. అంతలా సెల్ భూతం అందరినీ ఆవరించింది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైన వేళ ఒకరిద్దరి సంతానంతో సరి పెట్టుకుంటున్న తల్లిదండ్రులకు ఈ తరహా పరిణామాలన్నీ ఏ మాత్రం రుచించకపోగా వారికి చేదు అనుభవాలను మిగు లుస్తున్నాయి. ఇంటి యజమాని తీరిక లేకుండా విపరీతమైన ఒత్తిడితో ఉంటుండగా దీనికి విరుద్ధంగా ఇంట్లో మిగతా వారంతా సెల్ హల్ చేస్తున్నారు. ఖర్చుతో పాటు ఇంట్లో గొడవలకు ఇదే కారణమవుతోంది.

కంటి చూపు కరువే

విపరీతంగా సెల్‌ఫోన్ వినియోగిస్తున్న వారిలో అనేక రుగ్మతలు బయటపడుతున్నా వీటికి దూరంగా ఉండడానికి ఏ మాత్రం ఇష్టపడడం లేదు. కేవలం సమాచారం, ఎక్కడి కక్కడ పరస్పర సహకారం నిమిత్తం ఉపయోగ పడాల్సిన సెల్ ఫోన్‌ల వాడకం విపరీతం కావడంతో అంతే వేగంగా రుగ్మతలు వచ్చిపడు తున్నాయి. రోజువారి నిరంతరం సెల్‌లో మునిగి తేలేవారిలో అత్యధికులకు ఈ మధ్యన చత్వారం వచ్చిపడుతోంది. వయసుతో నిమిత్తం లేకుండా రెండు కళ్ళు కాస్తా నాలుగు కళ్ళవుతున్నాయి. దీనికితోడు మానసిక రుగ్మతలు తోడవుతున్నాయి. అనవసరంగా ఆవేశపడడం, తమకంతా తెలిసినట్టుగా విర్ర వీగడం, కారణం లేకుండా రెచ్చిపోవడం వంటి దుష్పరిణామాలు కొందరిలో కనిపిస్తున్నాయి.ఇవి మనిషి వ్యక్తిత్వాన్ని మార్చేస్తు న్నాయి. ఫలితంగా మిత్రత్వం దూరమై శతృత్వం పెరుగుతూ వస్తుంది. ఎదుటి వారిని వ్యక్తిగతంగా దూషించడం, అప్రదిష్టపాల్చేయడం, నిందించడం, సవాల్ చేయడానికి అంతా సెల్ వేదికవుతుంది. అన్ని కుటుంబాల్లోను అశాంతికి దారితీస్తున్నది. అత్యధికులు మానసిక స్థైర్యం కోల్పోయి ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. తెల్లవార్లూ ఒంటరిగా సెల్‌లో యాప్‌లు మార్చి మార్చి గమనించడం, తద్వారా నిద్రలేమితో విహీనులుకావడం ఈ మధ్యన అందరిలోనూ కనిపిస్తుంది. ఆడ, మగ తేడా లేకుండా, వయస్సుతో నిమిత్తం లేకుండా ఇలాంటి పరిస్థితులు తాండవిస్తున్నాయి.

అవసరం మేరకే వాడండి

మారుతున్న రోజుల్లో అవసరాలు పెరుగుతున్నాయి. ఇప్పుడు మొబైల్ లేకుంటే అత్యంత కష్టం. జీవితంలో మూడో వంతు భాగమైంది. అదీ ఉద్యోగమైనా, వ్యాపారం అయినా, ఇతరత్రా వ్యవహారమైనా సరే మొబైల్ లేకుంటే గడవనే గడవదు. కేవలం ఉన్నంతలోనే అవసరాలకు వాడుకోవడం, ఆ తరువాత దూరంగా ఉంచాల్సిన పరిస్థితులు ఇప్పుడు అందరి ఎదుట సవాల్‌గా మిగిలాయి. ఈ పరిస్థితి నుంచి తమంతట తాముగా బయటపడడం అందరూ అవర్చు కోవాలి. ఏ కాలంలో చేయాల్సిన పని ఆ కాలం లోనే చేసే విధంగా సమయాను కూలంగా నిర్ణయాలు తీసుకోవాలి.





సెల్‌ఫోన్ చేతిలో ఉండాల్సిందే..

స్లోపాయిజన్ : నాగమణి యాదవ్



స్మార్ట్ ఫోన్ మనిషి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. స్లోపాయిజన్‌గా మారి పోయింది. ఆరోగ్యంతో పాటు మానవ సంబంధాలను దెబ్బ తీస్తోంది. గంటల తరబడి వినియోగిస్తూ అత్యధికులు సెల్ బానిసలవుతున్నారు. అతి వినియోగం అనర్థానికి దారితీస్తుంది. ఈ విషయాన్ని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిర్ధారించింది. సెల్ వినియోగంలో మార్పు రాకపోతే అటు ఆర్థికంగాను, ఇటు వ్యక్తిత్వ పరంగాను దెబ్బతినాల్సిందే.

ఇదే ప్రపంచం : వెలిశిల రామకృష్ణ



సెల్‌ఫోన్ ద్వారా ఒంటరి జీవితానికి అలవాటుపడు తున్నారు. అనవసర విషయా లకు, గేమ్స్‌కే సమయం ఇస్తున్నారు. ఆఖరుకి ఇంట్లో వారితో కూడా మాట్లాడే తీరిక లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. రోజులు మారుతున్నట్టే మనం కూడా మారాలి. కాని ఇది కాస్తా వ్యసనంగా మారకూడదు. వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్లు జీవితం కాదనే విషయం అందరూ గుర్తు పెట్టుకోవాలి.


జిల్లా పోలీస్ స్పోర్ట్స్ యాన్యువల్ మీట్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ పొందిన ఏఆర్ పోలీసులు.. అదనపు ఎస్పీకి కప్పు అందిస్తున్న ఐజీ , ఎస్పీ

సవాళ్లు స్వీకరించడం... నేర్చుకోవడం క్రీడాస్ఫూర్తి

ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు అంటే గెలుపు ఓటమి మాత్రమే కాదని సవాళ్ళు స్వీకరించడం, వాటి నుంచి నేర్చుకోవడం మన సామర్థ్యాలను నిరూపించుకోవడం క్రీడాస్ఫూర్తికి పెంచుతాయని ఏలూరు రేంజ్ ఐజీ జీవిజీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ స్పోర్ట్స్ యాన్యువల్ మీట్ ముగింపు కార్యక్రమం ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం రాత్రి నిర్వహించారు.ముఖ్య అతిథిగా ఏలూరు ఐజీ పాల్గొన్నారు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్న వారందరూ తమ ధైర్యం, జట్టు విజయం, ప్రయత్నం ఎదుటి వారికి స్ఫూర్తిని ఇస్తాయన్నారు. క్రీడల్లో గెలుపు ఒక భాగం మాత్రమేనని క్రీడల్లో పోటీ చేయడం నిజమైన విజయం అన్నారు. పోలీస్ వ్యవస్థలో ప్రవేశించిన సమయంలో అందరూ శారీరక ధృఢత్వం కల్గి ఉంటారని రానురాను ఆహారపు అలవాట్లు వల్ల, వ్యాయామం తగ్గించడం వల్ల వ్యాధులకు గరువుతున్నారన్నారు. ప్రతిఒక్కరు గంట పాటు అయినా వ్యాయామం చేయాలని, మోటారు సైకిల్ వాడే కంటే నడిస్తే ఆరోగ్యానికి ఎంతో మంచిన్నారు. ప్రతి మనిషి రోజులో కనీసం ఆరు వేల అడుగులు అయినా నడవాలన్నారు. పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగ లుగుతారన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ స్పోర్ట్స్‌మీట్‌లో ఏర్పడిన స్నేహాలు, ఆత్మీయ విశ్వాసం దైనందిక జీవితాల్లో విజయం సాధించడానికి ఉపయోగపడాలని సూచించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఏలూరు జిల్లా ఆర్మ్‌డు రిజర్వు పోలీసులు సాధించారు. విజేతలకు మెడల్స్, మెమెంటోలు అందించారు. అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ శేఖర్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పాల్గొన్నారు.

బంగారు బుల్లోడు

అన్ని విభాగాల్లోను గోల్డ్ మెడల్స్



పాలకోడేరు, నవంబరు 23 (ఆంధ్రజోతి) : ఆటల్లో పాల్గొనేటప్పుడు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, వెటరన్ వంటి విభాగాల్లో పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. దీనికి వయసును బట్టి కేటగిరీలు నిర్ణయిస్తారు. అందులో విజేతలకుకి మెడల్స్ ఇస్తారు. పాలకోడేరు మండలం గొల్లల కోడేరుగ్రామానికి చెందిన దెందుకూరి అనిష్ వర్మ పవర్ లిఫ్టింగ్‌లో నాలుగు విభాగాల్లో స్వర్ణపతకాలను సాధించి అందిరిచేత శభాష్ అనుపించుకున్నాడు. అనిష్ వర్మ అమరావతిలోని విట్ కళాశాల్లో బీటెక్ రెండో సంవత్సరం చదువుతు న్నాడు. వర్మకు షటిల్, టేబుల్ టెన్నిస్ ఆటలు అంటే ఎంతో ఇష్టం.అనిష్ వర్మ 6.3 ఎత్తు ఉండటంతో కళాశాల యాజమాన్యం పవర్ లిఫ్టింగ్‌పై దృష్టిపెట్టమని సూచించారు. కళాశాల ఇంటర్ కాంపిటేషన్ పోటీల్లో పాల్గొని సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, వెటరన్ విభాగాల్లోను గోల్డ్‌మెడల్స్ సాధించాడు..

ఆధ్యాత్మికం




మావుళ్లమ్మకు సారె సమర్పించిన మాలధారులు

భీమవరం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ మాలధారులు శనివారం ఊరేగింపుగా వచ్చి మావుళ్లమకు సారె అందించారు. ఆలయానికి సమీపంలో మోటుపల్లి వారి వీధిలో ఉన్న అమ్మవారి గరగల గుడిదగ్గర నుంచి మంగళ వాయిద్యాలు, అమ్మవారి శరణ ఘోషతో బయలుదేరారు. ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై భక్తులు తీసుకు వచ్చిన స్వీట్లు, పండ్లు ఉంచారు. 125 కేజీల లడ్డును భక్తులు తయారు చేయించారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించి హారతులను అందించారు. అమ్మవారి నైవేద్యాన్ని పంపిణీచేసారు. ఈవో బుద్దా మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు. భీమవరం ముచ్చు వారి తోటలో ముద్దుల రాము ఆధ్వర్యంలో మేళతా ళాలతో అమ్మవారి సారెతో పురవీధుల మధ్య శోభా యాత్ర నిర్వహించారు.


హారతి ఇస్తున్న అర్చకుడు



ముచ్చు వారి తోట నుంచి యాత్రగా బయలుదేరిన భక్తులు



కాళ్ళకూరు వెంకన్నకు ఊంజల్ సేవ

కాళ్ళ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం 4వ శనివారం స్వామి, అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన, ఊంజల్ సేవ ఘనంగా జరిపారు. కాళ్ళకూరు గ్రామానికి చెందిన అడ్డాల వెంకటగణపతిరాజు, వెంకట సత్యవతి దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.



భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమలేశుని దివ్యక్షేత్రం శనివారం భక్తుల రాకతో కిటకిటలాడింది. కార్తీక మాస పర్వదినాలతో పాటు స్వామికి ప్రీతికరమైన రోజు అవడం వల్ల ఆలయానికి దాదాపు 20 వేల మంది పైబడి యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి 3 గంటల పైబడి సమయం పట్టింది. ఆలయానికి వచ్చిన పలువురు యాత్రికులు ముందుగా కేశఖండన శాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉచిత అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదం స్వీకరించారు.



ఔషధాల గని.. అడవి నాభి

పోలవరం , నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాపికొండల అభయారణ్యంలో ప్రకృతి ఒడిలో అందంగా పుష్పించి పాపికొండలకే అందం తెస్తుందీ ఈ అడవి నాభి పుష్పం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో, ఇతర ప్రాంతాలలో చూపరులను ఆకట్టుకుంటుంది. పూసినప్పటి నుంచి రాలిపోయే వరకూ అనేక రంగులు సంతరించుకుంటుంది.. ఔషధ గుణాలు కలిగిన ఈ అందమైన మొక్క ఉద్యాన వనాల్లో పెంచదగిన తీగజాతి మొక్క . దీని పువ్వులు అనేక రంగులతో ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ పూవులు చెట్టుపైన కనీసం ఏడురోజుల పాటు ఉంటాయి. ఈ సమయలో పలు రంగులను సంతరించుకోవడం ఈ పువ్వు ప్రత్యేకత. అడవినాభిగా పిలుచుకునే ఈ మొక్క శాస్త్రీయ నామం గ్లోరియోసా సుపర్బా దీన్ని సంస్కృతంలో అగ్నిముఖి, కన్నడలో అగ్నిశిఖ , ఇంగ్లీషులో గ్లోరీ లిల్లీ అని పిలుస్తారు. ఈ మొక్కలో కోల్చిసిన్ అనే ఆల్కలాయిడ్ ఉంటుంది. దీనిని గౌటు వ్యాధి నివారణలో ఉపయోగిస్తారు. దుంపలను అల్సర్లు, పైల్స్, గనేరియా వంటి వ్యాధుల నివారణకు, గర్భ స్రావానికి పాము , తేలు కాటు విరుగుడుకు ఉపయోగిస్తారు. ఇది కడుపులో ఉండే క్రిములను బయటకు పంపివేయడానికి , దీర్ఘ కాలిక వృణాలు, గడ్డలు, శరీరంపై మంటలు, పొత్తి కడుపు నొప్పి, దురదలను తగ్గించడంలో ఉపయోగిస్తారు. చర్మ సంబంధిత వ్యాధులకు, పైపూతగా ఉపయోగపడుతుంది. ఇది విషపూరిత మొక్క కావడం వల్ల ప్రకృతి వైద్యుల సలహా, సూచనల మేరకు మాత్రమే వాడుకోవాలి.


అడవినాభి కాయ



సూర్యనారాయణరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పురందేశ్వరి

శ్రీనివాస వర్మకు పురందేశ్వరి పరామర్శ

భీమవరం టౌన్, తణుకు, తాడేపల్లిగూడెం అర్బన్, ఉండి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తండ్రి సూర్యనారాయణరాజు మృతి చెందడంతో శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి పరామర్శించారు. సూర్యనారాయణరాజు చిత్ర పటంవద్ద పూలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, మంత్రి నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, పత్సమట్ల ధర్మరాజు, పులపర్తి అంజిబాబు, బొలిశెట్టి శ్రీనివాస్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరు బాపిరాజు, అన్నపూర్ణ దంపతులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, పీవీఎల్.నరసింహరాజు, పోలిశెట్టి దాసు, నారిన తాతాజీ, అల్లూరి సాయి దుర్గ రాజు, ఉన్నమట్ల కపర్థి, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కోళ్ల నాగేశ్వర రావు, పురిఘళ్ళ రఘురాం, పొత్తూరి బాపిరాజు, మెరగాని నారాయణమ్మ, వీరవల్లి చంద్రశేఖర్ వీరవాసరం ఎంపీపీ దుర్గాభవాని, చేపల రాము, దంతులూరి బోస్, చింతలపాటి లక్ష్మీనరసింహ రాజు, భూపతిరాజు నాగేంద్రవర్మ, వేగేశ్న రామకృష్ణంరాజు, తదితరులు శ్రీనివాస్ వర్మను పరామర్శించారు.



అద్దేపల్లి జయంతి సభలో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

అద్దేపల్లి సేవలు చిరస్మరణీయం : నిమ్మల

పాలకొల్లు టౌన్, నవబరు 23 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లులో దివంగత అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి సేవలు చిరస్మరణీయమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏడాది పాటు నెలనెలా నిర్వహిస్తున్న అద్దేపల్లి జయంతి వేడుకలు శనివారం పూలపల్లి గౌతమి జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగాయి. నిమ్మల మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంలో బ్రిటిష్ దొరలకు ఎదురొడిన ధైర్యశాలి అన్నారు. పాలకొల్లు మొదటి శాసనసభ్యుడిగా పనిచేసి ప్రజాసేవకు అంకితమయ్యారన్నారు. ఆయన ఆశయాల సాధనకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. అద్దేపల్లి జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి మంత్రి రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులను ఘనంగా సన్మానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, బీజేపీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్ ఉన్నమట్ల కబర్ధి, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, దుర్గాప్రసాద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



హెడ్‌కానిస్టేబుల్ మూర్తి, కానిస్టేబుల్ రవికుమార్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న ఎస్పీ కిశోర్

బాధితులకు న్యాయం చేయాలి : ఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. జిల్లాలో కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది పలు కేసులలో సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి బాధితులకు న్యాయం, ముద్దాయిలకు శిక్షపడేలా కీలక పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో 2016లో నమోదైన కేసులో భార్య, కుమార్తె ఆత్మహత్య చేసుకోవడంతో ఈ కేసులో ముద్దాయికి కోర్టు పదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించింది. ఈ కేసులో సాక్ష్యులను సకాలంలో ప్రవేశపెట్టిన మానిటరింగ్‌సెల్ హెడ్ కానిస్టేబుల్ కెఎస్ఎన్ మూర్తి(హెచ్‌సి 1294), కానిస్టేబుల్ టి.రవికుమార్ (పిసి 2117)కు ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం పశంసాపత్రాలు, నగదు బహుమతులను ఎస్పీ అందించి అభినందించారు. ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు పాల్గొన్నారు.

ఏలూరు మార్గంలో 8 రైళ్లు రద్దు

ఏలూరు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైళ్ల పట్టాల ఆధునీకరణ పనులను పురస్కరించుకుని ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నల్ సిస్టమ్‌ను తాడి - దువ్వాడ మధ్యలో నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈనెల 25వ తేదీన ఏలూరు మీదుగా వెళ్ళే ఎనిమిది రైళ్ళను రద్దు చేస్తున్నట్లు విజయవాడ డివిజన్ సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్ నెంబర్ 12718 విజయవాడ - విశాఖపట్నం, 12717 విశాఖపట్నం - విజయవాడ, 17267 కాకినాడ పోర్టు - విశాఖపట్నం, 17268 విశాఖపట్నం - కాకినాడ పోర్టు, 17239 గుంటూరు - విశాఖపట్నం, 17240 విశాఖపట్నం - గుంటూరు, 07466 రాజమండ్రి - విశాఖపట్నం, 07467 విశాఖపట్నం - రాజమండ్రి రైళ్లను ఈనెల 25న రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

జార్ఖండ్ హైకోర్టులో జిల్లా జడ్జి ఉద్యోగాలకు నోటిఫికేషన్

ఏలూరు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రంలోని హైకోర్టు పరిధిలో 15 జిల్లాల జడ్జిల నియామకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. జార్ఖండ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వివరాలు పంపించారని ఉమ్మడి జిల్లా జడ్జి సి.పురుషోత్తమకుమార్ శనివారం తెలిపారు. బార్ అసోసియేషన్‌లో అర్హుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నారన్నారు. అర్హత లున్న వారు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జనరల్ అభ్యర్థులు రూ.1500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవలసి ఉంటుంది. ఎంపికైన వారికి రూ. 144840-194660 (లెవెల్ జె-5) పేస్కేలు అమలు చేయబడుతుందన్నారు. పూర్తి వివరాలు, దరఖాస్తు ఫారాలను జార్ఖండ్ హైకోర్టులో www.jharkhandhigcourt.nic.in వెబ్‌సైట్‌లో పొందవచ్చని జిల్లా జడ్జి పురుషోత్తమకుమార్ తెలియజేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లేవ్







సాఫ్ట్‌వేర్ రంగం మందగమనంలో ఉండడంతో ఇంజనీరింగ్ పూర్తయిన అభ్యర్థులు నిరుద్యోగులుగా మిగులుతున్నారు. రెండేళ్లుగా క్యాంపస్ ఎంపికలు 50 నుంచి 10శాతానికి పడిపోయింది. ఇంజనీరింగ్ పూర్తయిన వారికి ఆఫ్ క్యాంపస్ ఆన్‌లైన్ ఎంపికలు కష్టంగా మారాయి. జిల్లాలో రెండేళ్లుగా ఇంజనీరింగ్ పూర్తయిన వారిలో 18వేల మంది ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నట్లు అంచనా.

- ఉద్యోగం వేటలో ఇంజనీరింగ్ విద్యార్థులు
- పాత కంపెనీలలో ఉద్యోగ పొడిగింపు లేదు
- జిల్లాలో ఏటా 10 వేల మంది ఇంజనీరింగ్ అభ్యర్థులు
- రెండేళ్లుగా 10 శాతం దాటని ప్లేస్‌మెంట్స్

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 15 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి ఏడాదికి 10 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ సర్టిఫికెట్‌తో బయటకు వస్తున్నారు. 2023లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగావకాశాలు తగ్గిపోవడంతో 10శాతం మంది మాత్రమే ఉద్యోగాలు పొందారు. 90 శాతం మంది ఉద్యోగ వేటలో ఉన్నారు. ఈ ఏడాది ఈనెలలోపే క్యాంపస్ ఇంటర్వ్యూల ప్రక్రియ దాదాపు పూర్తి కావాల్సి ఉంది. ప్రస్తుతం క్యాంపస్ ఎంపికలకు సాఫ్ట్‌వేర్ కంపెనీలు పెద్దగా రాలేదు. ఈసారి విద్యార్థులు ఆఫ్ క్యాంపస్‌లలో ఉద్యోగాలు వెతుక్కోవాల్సిందే.

ఉద్యోగాల పొడిగింపు లేదు

గడిచిన ఏడు, ఎనిమిదేళ్లుగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు చేస్తున్న సీనియర్ల కొలువుకు భద్రత లేదు. వారు ఉద్యోగం పొందిన కంపెనీలో ఒప్పంద గడువు ముగిసిన తర్వాత సంబంధిత కంపెనీలు ఒప్పంద పొడిగించడానికి సుముఖంగా లేవు. దీంతో సీనియర్ ఉద్యోగులు సైతం తిరిగి ఉద్యోగ ప్రయత్నాలు చేయాల్సి వస్తోంది. జిల్లాలో వందల సంఖ్యలో ఉద్యోగావకాశం కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి.

కొత్త ప్రాజెక్ట్‌లు లేవు

ఇంజనీరింగ్ చివరి సంవత్సరం లోనే క్యాంపస్ ప్లేస్‌మెంట్ 50శాతం వరకు వచ్చేవి. రెండేళ్లుగా క్యాంపస్ ఇంటర్వ్యూలకు కంపెనీలు ఆసక్తి చూపడం లేదు. ఇంజనీరింగ్ పూర్తయిన వారు ఉద్యో గాలు సాధించలేకపోతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగం లో పెద్ద ప్రాజెక్టులు లేకపోవడంతో ఉపాధి కల్పనకు గండి పడింది. కోట్ల రూపాయలలో ఉండే ప్రాజెక్టులు ఇప్పుడు లక్షలతో కూడిన ప్రాజెక్టులుగా మారాయి. ఉన్న ఉద్యోగులకు జీతాలు ఎలా అనే ఆలోచనలో పెద్ద కంపెనీలు ఆలోచిస్తున్నాయి. అందువలన కొత్తవారిని తీసుకురావడం లేదు. ఇతర దేశాల నుంచి వచ్చే పెద్ద ప్రాజెక్టులు వచ్చే అవకాశాలు కనబడడం లేదు. దీని వలన కొత్త ఉద్యోగాలు అందుబాటులో లేవు.

ఆఫర్ లెటర్ వచ్చినా..!

గత ఏడాది ఇంజనీరింగ్ పూర్తయిన వారికి క్యాంపస్, ఆన్ క్యాంపస్‌లలో ఎంపికైన వారికి పలు కంపెనీల ఆఫర్ లెటర్ ఇచ్చాయి. ఏడాది గడిచినా వారికి సంబంధిత కంపెనీల నుంచి పిలుపు రాలేదు. వేల మంది ఈ తరహాలో ఉద్యోగాలలో చేరేదెప్పుడు అని ఎదురు చూస్తున్నారు. గతంలో కంపెనీ ఆఫర్ లెటర్ ఇచ్చిన 6 నెలలు వ్యవధిలోపే పిలవడం ఉద్యోగంలో చేర్చుకోవడం జరిగేది. ప్రస్తుతం ఆఫర్ లెటర్ చేతిలో ఉన్నా ఉద్యోగానికి పిలుపు లేదు.

ఏ ఉద్యోగానికైనా రెడీ..!

ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు నిరుద్యోగ సమస్యను అధిగమించేందుకు ఏ ఉద్యోగానికైనా రెడీ అంటున్నారు. కొన్ని రోజులు క్రితం భీమవరంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఆక్వా, బ్యాటరీ కంపెనీలలో పనిచేసే ఉద్యోగాలు అందుబాటులో ఉండగా 20 మంది పైగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు హాజరయ్యారు. నెల జీతం రూ.14,500. ఉద్యోగ మేళా నిర్వాహకులు మీకు సంబంధించిన ఉద్యోగం కాదని వారిని పంపించేశారు. చిన్న తరహా బ్యాంకులు, కళాశాలలో బోధనల పనుల్లో చేరుతున్నారు.

నో రికమండేషన్

సాఫ్ట్‌వేర్ రంగంలో రెండేళ్ల క్రితం వరకు ప్రముఖ కంపెనీలలో పనిచేసే హెచ్‌వోడీలు, సీనియర్ ఉద్యోగులు తెలిసిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించేవారు. మరి కొంతమంది ఆ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చేలా చేసేవారు. వేల సంఖ్యలో కొత్త వారికి ఉద్యోగాలు రికమండేషన్‌తో వచ్చేవి. ప్రస్తుతం సీనియర్ల రికమండేషన్‌తో ఒక్క ఉద్యోగం కూడా పొందే అవకాశం లేదు.

రెండేళ్ల ఒప్పందం ముగిసింది

ఐదేళ్ల క్రితం క్యాంపస్ ఇంటర్వ్యూలో ప్రముఖ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. రెండేళ్ల ఒప్పందంతో వెళ్లాను. తర్వాత మూడేళ్లు ఒప్పందం పొడిగించుకున్నాను. ఇప్పుడు ప్రాజెక్టు అయిపోయింది. తిరిగి ఒప్పందం పొడిగించడానికి కంపెనీ ఒప్పుకోలేదు. ప్రస్తుతం ఖాళీ అయ్యాను. కొత్త ఉద్యోగం కోసం వెతుకులాటలో ఉన్నాను.

బి.నరేష్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లు లేవు

సీఎస్ఈ గ్రూపుతో ఇంజనీరింగ్ ఈ ఏడాదితో పూర్తయింది. రెండు క్యాంపస్ ఇంటర్వ్యూలను ఫేస్ చేశాను. రెంటింటిలో కూడా ఎంపిక చేసుకోలేదు. మూడేళ్ల క్రితం మా కాలేజీలో 50 శాతం ప్లేస్‌మెంట్స్ అయ్యాయి. నేను ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరంలో ఉండగా 10శాతం కూడా ప్లేస్‌మెంట్ లేదు. సాఫ్ట్‌వేర్ కంపెనీ వారు తీసుకోవడానికి ఆసక్తిగా ఉండడం లేదు.

ప్రణీత్, ఇంజనీరింగ్ విద్యార్థి



పెద్ద ప్రాజెక్ట్‌లు లేక..

సాఫ్ట్‌వేర్ రంగంలో పెద్ద ప్రాజెక్టులు లేవు. అందుకే ఉద్యోగావకాశాలు తక్కువ. విద్యార్థులు కమ్యూనికేషన్స్ స్కిల్స్, కోడింగ్ నాలెడ్జ్ పై పట్టు సాధించాలి. సెమిస్టర్ పర్సంటేజ్ 75 పైన ఉండేలా చూసుకోవాలి. అప్పుడే ఉద్యోగావకాశం సులభం.

సీహెచ్.రామకిశోర్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్, డీఎన్నార్ కళాశాల



తగిన నైపుణ్యం ఉండాలి

ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. సాఫ్ట్‌వేర్ రంగం స్లోగా ఉన్నా బయటకు వచ్చేసరికి ఉద్యోగం సాధించే నైపుణ్యంతో ఉంటా. కంపెనీ వాళ్లకు కావల్సిన కంప్యూటర్ కోర్సులు, ఇండివిడ్యువల్ సర్టిఫికెట్ కోర్సులు చేస్తాను.

- డి.భవాని వర్షిత, డీఎన్నార్ ఇంజనీరింగ్ విద్యార్థిని



చదువుతూనే ఇంటర్న్‌షిప్ చేస్తా

ప్రస్తుతం ఉద్యోగావకాశాలు తక్కువ. నేను ఇంజనీరింగ్ పూర్తయ్యే సరికి సెమిస్టర్‌లలో 80శాతం పైగా మార్కులు సాధించాలనుకుంటున్నాను. చదువుతూనే ఇంటర్న్‌షిప్ చేస్తా. స్కిల్స్ ఉంటే కంపెనీలలో ఉద్యోగం సాధించవచ్చు.

- సీహెచ్.లక్ష్మీ శ్రావ్య, డీఎన్నార్ ఇంజనీరింగ్ విద్యార్థిని

క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు : జేసీ



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందవచ్చని, యువత క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక డీఎన్నార్ కళాశాల క్రీడామైదానంలో 16వ ఈశా గ్రామోత్సవం రూరల్ ప్రీమియం లీగ్ (వాలీబాల్ పురుషులు, త్రోబాల్ స్త్రీలు)-24 శనివారం ఆయన ప్రారంభించారు. పలు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని, విజయం సాధించాలన్నారు. కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఇటువంటి క్రీడల పోటీలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈశా ఫౌండేషన్ డాక్టర్ డి.విజయ, ఉపేంద్రవర్మ, కేపీ వర్మ మాట్లాడుతూ మొదటి లెవల్ (క్లస్టర్) మ్యాచ్‌లు రెండు రోజులు పాటు పురుషులు వాలీబాల్, స్త్రీలు త్రోబాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. వీటిలో గెలుపొందిన వారు రెండో లెవల్‌కు అర్హత సాధిస్తారని, వాటిలో గెలుపొందిన వారు డిసెంబరు 28న కోయంబత్తూరులో జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారని తెలిపారు. ఫైనల్స్ గెలుపొందిన వారికి రూ.5లక్షలు బహుమతి అందిస్తారన్నారు. తహసీల్దార్ రావి రాంబాబు, కళాశాల పాలకవర్గ సభ్యులు కె.రామకృష్ణంరాజు, బీవీ నరసింహరాజు, పీఈటీ ఉపాధ్యాయులు, 45 టీమ్స్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా డిగ్రీ దూర విద్య పరీక్షలు

కుక్కునూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరులోని ఒక ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ దూర విద్య పరీక్షలు శనివారం సక్రమంగా నిర్వహించారు. 'ఫీజు మీది పరిక్ష మాది' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో నిర్వాహకులు అప్రమత్తం అయ్యారు. స్థానిక మహిళలతో పరీక్షలు రాయిస్తున్నారని మండలంలో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకుని సక్రమంగా నిర్వహించినట్లు తెలిసింది.

'ఏఎంఆర్' పరిమితి మించి వాడకూడదు

పెంటపాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యాంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) పరిమితిని మించి వాడకూడదని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి మురళీకృష్ణ అన్నారు. పెంటపాడులో పశుసంవర్థక శాఖ, పారావెటర్నరీ, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎంఆర్‌ను అధికంగా వాడడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. డాక్టర్ ఆనంద్‌కుమార్, డాక్టర్ ఆనందరావు, డాక్టర్ సుధ ప్రసంగించారు.

పట్టభద్రుల ఓటర్ల జాబితా ముసాయిదా

- తూర్పు, పశ్చిమ జిల్లాల ఓటర్లు 2,61,728
- 9 వరకు అభ్యంతరాల స్వీకరణ
- కొత్తగా ఓటు నమోదుకు అవకాశం
- వచ్చేనెల 30న తుది జాబితా ప్రచురణ

కాకినాడ / భీమవరం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గ ఓటర్ల జాబితా ముసాయిదా శనివారం ప్రచురించారు. తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఓటు నమోదు అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రచురించారు. ఇప్పటివరకు 2,61,728 దరఖాస్తులు రాగా వాటిని జాబితాలో నమోదు చేశారు. దీనిలో పురుషులు 1,54,769 మంది, మహిళలు 1,06,922 మంది ఉన్నారు. జిల్లాల వారిగా పరిశీలిస్తే కాకినాడ జిల్లాలో 55958, తూర్పుగోదావరి జిల్లాలో 51624, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 53726, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3336, ఏలూరు జిల్లాలో 36268, పశ్చిమగోదావరి జిల్లాలో 60816 మంది ఓటర్లుగా నమోదు అయ్యారు. ఈ జాబితాను ఆరు జిల్లాల్లో ఉన్న కలెక్టరేట్‌లు ఆర్డీవో కార్యాలయాలు, సబ్ కలెక్టర్ కార్యాలయాలు, తహసీల్దార్ల కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు, ప్రదర్శిస్తున్నారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు వచ్చే నెల 9 వరకు తెలపవచ్చు. వచ్చేనెల 9వరకు కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు చేయవచ్చు. వచ్చేనెల 30న తుది జాబితా ప్రచురిస్తారు. ఇతర వివరాలకు టోల్ ఫ్రీ నెంబరుకు 1950 సంప్రదించాలి.

ఆస్తి వివాదం: తల్లీ కొడుకు దారుణ హత్య

మండవల్లి నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం గన్నవరంలో శుక్రవారం రాత్రి తల్లి, కొడుకు దారుణ హత్యకు గురయ్యారు. ఆస్తి వివాదాలు కారణమని స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు. గుర్తు తెలియని దుండగులు కిరాతకంగా కత్తితో గొంతు కోసి హత్య చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన రొయ్యూరు భ్రమరాంబ (60), ఆమె కుమా రుడు సురేష్ (35) శనివారం వేకువజామున వారి నివాసం వద్ద విగతజీవులు గా పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ రవికుమార్, ఎస్ఐ రామచంద్రరావు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. పోలీసు జాగిలాలను రప్పించగా అవి గ్రామంలోని పలు ప్రాంతాల్లో కలియదిరిగాయి. డీఎస్పీ మాట్లాడుతూ శుక్రవారం అర్ధరాత్రి గొంతును కత్తితో కోసి దుండగులు హత్య చేసినట్టు గుర్తించామన్నారు. సమీప బంధువులతో ఆస్తి తగాదాలే హత్యకు కారణమని అనుమానిస్తు న్నట్టు తెలిపారు. మృతదేహాలను కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సురేష్ భార్య, కుమార్తె ఊరెళ్లారు. ఇంట్లో తల్లి, కుమారుడు మాత్రమే ఉండడం గమనించి దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. జంట హత్యలతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

జంట హత్యలతో ఉలిక్కిపడిన గన్నవరం



రొయ్యూరు భ్రమరాంబ, సురేష్ మృతదేహాలు

క్రైమ్ కార్నర్



రికవరీ చేసిన సొమ్ము అందిస్తున్న ఎస్పీ కిశోర్

సెల్‌ఫోన్.. నగదు చోరీ

సొమ్ము రికవరీ చేసిన పోలీసులు

ఏలూరు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ అపహరించి, ఫోన్‌లో సేవ్‌చేసిన పాస్‌వర్డ్‌లు, యూజర్ నేమ్ ఆధారంగా నేరగాళ్లు రూ.3.14 లక్షలు చోరీ చేశారు. బాధితుడు 1930కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రూ.2,81,400 నగదు రికవరీ చేశారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం బాధితుడికి ఎస్పీ నగదు చెక్ అందించారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వేదాంతి రామానుజాచారి సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఫోన్‌లోని పాస్‌వర్డ్, యూజర్‌నేమ్ వినియోగించి నగదు అపహరించారు. ఆయన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి సైబర్ సెల్ ఎస్.మధు వెంకటరాజా దర్యాప్తు చేశారు.

బంగారం, నగదు తిరిగి అడిగితే.. చంపుతామని బెదిరించారు

భీమవరం క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాము ఇచ్చిన బంగారం, నగదు తిరిగి ఇవ్వాలని అడిగితే చంపుతామని బెదిరించారంటూ నర్సయ్య అగ్రహారానికి చెందిన అంతర్వేది అంజలీదేవి వన్‌టౌన్ పోలీస్‌లకు శనివారం ఫిర్యాదు చేశారు. అంజలీదేవికి పరిచయమున్న మండలి దుర్గాప్రసాద్, మండలి శివ సత్య 4 కాసులు బంగారం గొలుసులు, 5లక్షలు నగదు తీసుకున్నారు. నెల రోజులలో ఇస్తామని చెప్పారు. సంవత్సరం గడిచినా ఇవ్వకపోవడంతో అంజలీదేవి అడుగుతూనే ఉంది. దుర్గాప్రసాద్, శివసత్య ఒకరోజు అంజలిదేవి, ఆమె కుమార్తెపై దాడిచేసి అల్లరి చేస్తే చంపేస్తామంటూ బెదిరించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

ముసునూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరేపల్లిలో ఎక్సైజ్ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న చల్లారి ప్రియాంకను అదుపులోకి తీసుకుని 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఆమెను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై మస్తానయ్య తెలిపారు.

వేర్వేరు సంఘటనల్లో ముగ్గురి మృతి

కాలువలో పడి ఒకరు..

జంగారెడ్డిగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుల్లలు తెస్తానని వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఈ నెల 22న శుక్రవారం మధ్యాహ్నం మండలం లోని కేతవరం గ్రామానికి చెందిన చాగంటి రమేష్ (43)వంట కోసం పుల్లలు తీసుకురావడానికి పొలం వెళ్లాడు. రాత్రయినా రమేష్ ఇంటికి రాకపోవడంతో శనివారం ఉదయం గ్రామస్తులు వెతకగా కేతవరం గ్రామంలోని కాలువలో పడిఉన్నాడు. అక్కడ పరిశీలించగా గట్టుపై ఉన్న పుల్లలు మోపును లాగుతూ ప్రమాదవశాత్తు కాలువలో పడిపోగా తలకు రాయి తగిలి అక్కడే మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుని భార్య చాగంటి చిట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎన్.ఉమామహేశ్వరరావు తెలిపారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు..

పెదవేగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనం పై అంతస్తు నుంచి కిందపడిన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. తాళ్ళగోకవరంలో బొర్రా సాంబశివరావు భవన నిర్మాణం చేస్తున్నాడు. ఆకివీడు ప్రాంతానికి చెందిన తాపీపనివారు భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. ఆకివీడు ప్రాంతానికి చెందిన గురజ శ్రీనివాసరావు శనివారం పనికి వచ్చాడు. భవనం పైఅంతస్థులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు పైనుంచి జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు(35) తలకు తీవ్రగాయంకాగా, అతనికి ఏలూరు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీనివాసరావు మృతిచెందాడు. శ్రీనివాసరావు భార్య గర్భవతిగా చెప్తున్నారు. ప్రమాద సమాచారం వచ్చిందని, పూర్తివివరాలు తెలియలేదని పెదవేగి పోలీసులు తెలిపారు.

తెలియని మందు తాగి వృద్ధురాలు..

టి.నరసాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలియని మందు తాగిన వృద్ధురాలు మృతి చెందడంతో కేసునమోదు చేసినట్లు హెచ్‌సీ కె.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. అల్లంచర్ల కొత్తగూడెం గ్రామానికి చెందిన సూరిబోయిన మాణిక్యం (80)షుగర్, కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఈనెల 22న కళ్లు తిరిగి పడిపోగా కుటుంబీకులు స్థానిక ఆర్ఎంపీ చికిత్స చేయడంతో కోలుకుంది. ఇంటికి వెళ్ళిన తర్వాత కొంతసేపటికి వాంతులు అయ్యాయి. కుటుంబీకులు అడగ్గా గుర్తు తెలియని మందు తాగానని చెప్పడంతో జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెంది నట్లు ఆమె కుమారుడు సత్యనారాయణ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

కారును ఢీకొన్న టిప్పర్ లారీ

బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌కు తప్పిన ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

ఏలూరు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరు అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్ స్పెక్టర్ నెహ్రూకు త్రుటిలో ప్రమాదం తప్పింది. నెహ్రూ స్వగ్రామం రాజమహేంద్రవరం నుంచి శనివారం ఉదయం ఏలూరు బయలుదేరారు. మార్గమధ్యలో కొవ్వూరు సమీపంలో ఆయన కారును టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదం లో కారులో నెహ్రూ, హోమ్‌గార్డు, డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. సురక్షితంగా బయటపడ్డారు. కారు మాత్రం నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందుకున్న కొవ్వూరు రూరల్ సీఐ విశ్వం తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గిత్త బండితో పాదయాత్రగా శ్రీవారి క్షేత్రానికి..

ద్వారకాతిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు గిత్త బండితో ఓ భక్తుడు కుటుంబసమేతంగా పాదయాత్రగా ద్వారకా తిరుమల క్షేత్రానికి విచ్చేశాడు. భీమడోలు మండలం ఆంజనేయనగరం నుంచి రంగరాజు అనే వ్యక్తి బండిలో వినాయక స్వామిని ఉంచి పాదయాత్రగా కుటుంబంతో కలసి వచ్చి శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్నాడు. దారి పొడవునా భక్తులు బండిలోని వినాయకునికి హారతులు సమర్పించినట్లు రంగరాజు తెలిపాడు.

26న రైతుల ధర్నా

ద్వారకాతిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, రైతులకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం తీసుకురావాలని ఏపీ రైతుసంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కరరావు, కె.శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారానికి ఈనెల 26న కలెక్టరేట్ ముందు జరిపే మహాధర్నా జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సాయంత్రం సంఘ సభ్యులు మండలంలోని ఎం.నాగులపల్లిలో కరపత్రాలను పంపిణీ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు రైతులు పండించిన పంటకు ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలను నిర్ణయించాలని కోరారు. రైతుల పంట రుణాలు మాఫీ చేయాలన్నారు.

ఏఐటీయూసీ నుంచి సీఐటీయూలో కార్మికుల చేరిక

జంగారెడ్డిగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో 27 మంది పారిశుధ్య కార్మికులు ఏఐటీయూసీ నుంచి సీఐటీయూలో చేరినట్లు సీఐటీయూ నాయకుడు సోమయ్య తెలిపారు. కార్మికుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కార దిశగా సీఐటీయూ పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల నూతన కమిటీని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షురాలిగా షేక్ సుభాషిణి, అధ్యక్షురాలిగా కోట దయామణి, కార్యదర్శిగా గంగుల మేరి, కోశాధికారిగా శ్రీను, సహాయ కార్యదర్శిగా బొకినాల చల్లాలు, ఉపాధ్యక్షులు గండికృష్ణవేణి, మరో నలుగుర్ని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

13 దరఖాస్తుల స్వీకారం

కామవరపుకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కామవరపుకోట మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం దరఖాస్తులు నమోదు కార్యక్రమాన్ని వీఆర్వోలు నిర్వహించగా 13 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ గెడ్డం ఎలీషా తెలిపారు. ఆదివారం కూడా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వీఆర్వోలు, బిఎల్‌ఓలు ఓటర్ల నమోదు, తొలగింపులు, చేర్పులు, మార్పులు, మరొక కేంద్రానికి తరలింపు దరఖాస్తులు స్వీకరిస్తారని తహసీల్దార్ ఎలీషా, గుంటుపల్లి వీఆర్వో ప్రభాకరరావు తెలిపారు.

సారా నిషేధంపై అవగాహన

చింతలపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిగూడెంలో ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో గిరిజనులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సారా తాగితే జరిగే అనర్థాలు, తయారు చేస్తే తీసుకునే చర్యలపై వివరించారు. సదస్సులో మహిళలతో సారా తయారీ చేయమని ప్రమాణం చేయించారు. ఎస్‌ఐ అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అడ్డుకోవాలి

ఉంగుటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భీమడోలు సీడీపీవో కే.వి.విజయలక్ష్మి పిలుపు నిచ్చారు. శనివారం కైకరం హైస్కూలులో ప్రధానోపాధ్యాయుడు గుళ్ళ ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సు నిర్వహించారు. డి.సి.పి.యు కౌన్సిలర్ యూ.బాలస్వామి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తుంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 112కు కాల్ చేయాలన్నారు. సదస్సులో ఎం.ఎం.పి. హెచ్.ఏ.ఎం.ఎస్ రాజు, చేబ్రోలు ఏఎస్సై కే.సాంబశివరావు, జిల్లా కో-ఆర్డినేటర్స్ రవిబాబు, వినోద్ కుమార్ అంగన్వాడీ టీచర్లు,మహిళా సంరక్షణ కార్యదర్శి ఆశాలు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలు

ఉంగుటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేబ్రోలు సాయి గాయత్రి ఆలయంలోను, కైకరంలో సాహితీవేత్త జరావల్లభుల జగన్నాధం స్వగృహంలోను సత్య సాయి బాబా జయంతి వేడుకలు జరిగాయి. చేబ్రోలు సాయిగాయత్రి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, హోమం నిర్వహించారు. జగన్నాథం స్వగృహంలో నగర సంకీర్తన, భజనలు నిర్వహించారు.

క్యాన్సర్ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

ఏలూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజం పట్ల ప్రేమ ఉండాలని సోషల్‌సర్వీస్ డైరెక్టర్ పి.ఇమ్మానియేల్ అన్నారు. నిడమర్రు మండలం భువనపల్లిలోని ఇన్‌ఫాంట్ జీసెస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు, సిబ్బంది, తల్లిదండ్రులు చారిటీ ద్వారా సేకరించిన నగదుతో శనివారం వంగాయిగూడెంలోని క్యాన్సర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు.



నారాయణపురం వంతెన

ఆక్రమణల తొలగింపు సరే..

కొత్త వంతెనకు మోక్షమెప్పుడో?

పురాతన ఇరుకు వంతెనతో ప్రజల పాట్లు

ఉంగుటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డెల్టా, మెట్ట ప్రాంతాలకు వారధిగా ఉన్న నారాయణపురం వంతెనను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. నిత్యం వేలాది రవాణా వాహనాలు ఈ వంతెన గుండా ప్రయాణిస్తుంటాయి. దీనిని 1931లో నిర్మించారు. ఇరుకుగా ఉండి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో అధికారులు ఇటీవల సుమారు వంద ఆక్రమణలను తొలగించారు. కాగా ఇటీవల నారాయణపురం, ఉంగుటూరు ప్రాంతాలలో ఐస్ ఫ్యాక్టరీల ప్రభావంతో విస్తృతంగా చేపల ప్యాకింగ్ నిమిత్తం వాహనాలు ప్రయాణం సాగిస్తుండడం, కళాశాల వాహనాలతో నిత్యం రద్దీగా తయారయింది. అయితే ఇదే వంతెనను ఆనుకుని డెల్టా గ్రామాలకు వెళ్లే ప్రత్యేక మంచినీటి పథకం పైపులను కూడా వంతెన అంచుల వెంబడి వేయడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి హోదాలో జగన్ గణపవరం పర్యటనకు వచ్చినప్పుడు నియోజకవర్గంలోని వంతెనల నిర్మాణానికి హామీ ఇచ్చి రూ.8.5 కోట్లు మంజూరు చేశారు. అయితే బిల్లుల జాప్యంపై కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇరుకు వంతెన నుంచి విశాలమైన వంతెన నిర్మాణం కోసం స్థానికులు కోరుకుంటున్నారు.

గత పాలకులు విస్మరించారు



ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం ద్వారా డెల్టా మెట్ట ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది. అయితే గత పాలకులు పట్టించుకుంటే రవాణా ఇబ్బందులు తగ్గేవి. ఇకనైనా వంతెన నిర్మాణం కోసం ప్రజా ప్రతినిదులు కృషి చేయాలి.

-బొడ్డేపల్లి అప్పారావు, సీనియర్ సిటిజన్

పురాతన వంతెన తొలగించాలి



నారాచణపురం-గణపవరం రహదారిలో పలు మలుపులు ఉన్నాయి. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుతో పాటు 93 ఏళ్ళ వయసు ఉన్న వంతెన స్థానంలో ప్రజలకు ఉపయోగపడేలా కొత్త వంతెన నిర్మాణం జరగాలి.

-వేగేశ్న రంగరాజు, పారిశ్రామికవేత్త

చింతలపూడి అభివృద్ధికి సహకరించాలి



సీఎంతో ఎమ్మెల్యే రోషన్

చింతలపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును, పలు శాఖల మంత్రులను కోరినట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన రోజునే పలు అభివృద్ధి పనులకు సంబంధించి విజ్ఞాపనలు, నివేదిక అందజేశారు. నియోజకవర్గంలో రెండు మునిసిపాలిటీలు ఉన్నాయని, చింతలపూడి, జంగారెడ్డిగూడెం పట్టణాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, నాలుగు మండలాల్లో వివిధ అభివృద్ధి పనులపై సీఎం దృష్టికి తెచ్చారు. పామాయిల్ పంట అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని, మామిడి, వరి పంటలపై పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, విదేశీ పెట్టుబడులతో మెగా క్లస్టర్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని, ఆర్టీసి డిపో మంజూరు చేయాలని కోరారు. పర్యాటక కేంద్ర అభివృద్ధిలో భాగంగా గుంటుపల్లి బౌద్ధారామాలు అభివృద్ధి చేయాలని గుండేరు, ఖైనేరు వాగులపై వంతెనలు నిర్మించాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూ నిర్వాసితులకు మేలైన నష్టపరిహారం ఇవ్వాలని అటు అసెంబ్లీలో ప్రస్తావించడమేకాక సంబంధిత శాఖా మంత్రికి నివేదించారు. నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు, నిర్మాణాలకు 16.5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కామవరపుకోట ఏరియాలో ఎర్రకాలువ నుంచి ఘంటా హనుమంతరావు ఎత్తిపోతల పథకంలో పైపుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రులు లోకేశ్, నిమ్మల రామానాయుడు, నారాయణ, సవిత, కందుల దుర్గేష్, ఆరోగ్యశాఖ, రవాణ శాఖా మంత్రులను కలిసి వీటికి సంబంధించిన పనులపై చర్చించారు.

మహిళల రక్షణకు చట్టాల రూపకల్పన : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలకు పూర్తి రక్షణ కల్పించేలా చట్టాల రూపకల్పనకు పటిష్ట చర్యల ను కూటమి ప్రభుత్వం తీసుకుంటోందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం పలు అంశాలపై దృష్టి సారించిందన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుర్మార్గాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చట్టాల రూపకల్పనపై చర్చ జరిగిందన్నారు. మహిళలపై దాడులు, గంజాయి, మాదకద్రావ్యాల నిరోధకానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి వినతి



ఏలూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారులు, కొల్లేరు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రాలు సమర్పించారు. యానాం మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో మత్స్యకార సామాజికవర్గ, మత్స్యకార ప్రాంతానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, మత్స్యకార ప్రతినిధులతో కలిసి జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి వినతిపత్రాలు అందచేశారు. సీఎం చంద్రబాబు మత్స్యకారులకు అండగా ఉంటామని స్పష్టం చేశారని వెంకటలక్ష్మి తెలిపారు. అలాగే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సైతం మత్స్య కారుల జీవనోపాధికి, కొల్లేరు ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి పారి శ్రామిక అభివృద్ధి, జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారని వెంకటలక్ష్మి తెలిపారు.



బుట్టాయగూడెం సెంటరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

అదానీ కుంభకోణాలపై విచారణ జరపాలి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అదానీ కుంభకోణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఆయనను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.

బుట్టాయగూడెం: భారీ ఎత్తున అవినీతికి పాల్పడిన అదానీని తక్షణమే అరెస్టు చేయాలని శనివారం సీపీఎం ఆధ్వర్యంలో బుట్టాయగూడెం సెంటరులో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో నాయకులు తెల్లం రామకృష్ణ, తామా ముత్యాలమ్మ, అందుగుల ఫ్రాన్సిస్, కారం భాస్కర్ మాట్లాడుతూ అదానీ గ్రూపుతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న విద్యుత్, అన్ని రకాల ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో జరిగే సీపీఎం జిల్లా మహాసభల విజయంతానికి అంతా సహకరించాల న్నారు.

కుక్కునూరు: అదానీ గ్రూప్‌తో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలన్ని రద్దు చేసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో కుక్కునూరులో ధర్నా నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

పెదవేగి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా మహిళా చట్టాలపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మహిళల రక్షణకు న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తోందని మహిళలకు రక్షణ చట్టాలపై వివరించారు. ఉచిత న్యాయ సహాయానికి 15100 నంబర్‌కు కాల్ చేస్తే తక్షణం సంబంధిత అధికారులు స్పందించి, న్యాయం సహాయం అందిస్తారని తెలిపారు. ఏలూరుతోపాటుగా అన్ని కోర్టుల పరిధిలో మండల న్యాయ సేవాధికారసంస్థలు పనిచేస్తున్నాయని, అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం, ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి, కేసులను వాదించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు బి.వినీత, న్యాయవాదులు జి.మేరీ సునీత, తిరిగిపల్లి సుబ్బారావు, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారామ్, పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వీవీఎస్.మునీశ్వరరావు, డీసీపీవో డాక్టర్ సీహెచ్.సూర్యచక్రవేణి, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కోటలో నిరసన తెలియజేస్తున్న ప్రతినిధులు

మద్యం దుకాణం వద్దు

కామవరపుకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కామవరపుకోట చెక్‌పోస్టు సెంటర్‌లో మద్యం షాపును ఏర్పాటు చేయవద్దని కొత్తూరు గ్రామానికి చెందిన ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సెంటర్‌లో బ్రాందీ షాపు ఏర్పాటు చేస్తే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, అంతేకాక నేరాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. షాపు ఏర్పాటు చేస్తే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాకి సురేష్‌కుమార్, టి.వి.ఎస్.రాజు, ఐతం మహేష్, బండారు ప్రసాద్, కొవ్వూరి భాగ్యరాజ్, చక్రహరి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను టార్గెట్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు



మాట్లాడుతున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక ప్రపంచంలో డిజిటల్ లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీనిని ఆసరాగా తీసుకున్న నేరగాళ్ళు వృద్ధులను టార్గెట్ చేస్తున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్‌కుమార్ సూచించారు. ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వృద్ధుల కార్యాలయంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన మెస్సేజ్‌లు, లింకులు ఓపెన్ చేయవద్దన్నారు. అలా ఓపెన్ చేస్తే మన రహస్యమైన సమాచారం వారికి వెళ్ళిపోతుందన్నారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ళు రిటైర్డ్ అధికారులను టార్గెట్ చేస్తున్నారని వారి బ్యాంకు వివరాలను సేకరించి ముంబై, కలకత్తా, మద్రాస్, న్యూఢిల్లీ నుంచి సీబీఐ అధికారులమంటూ సైబర్ నేరగాళ్ళు వివిధ కారణాలతో బెదిరిస్తున్నారన్నారు. డిజిటల్ అరెస్టు అని బెదిరించడంతో అప్పటికప్పుడే డబ్బులను వారి అకౌంట్‌లో వేయడం జరుగుతుందన్నారు. ఇలా ఎవరైనా మోసపోతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. బెదిరింపు కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అంతర పంటల సాగుపై శిక్షణ



డ్రోన్ ద్వారా ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెదవేగి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక పంటల్లో అంతర పంటల సాగుతో రైతులు ఆర్థికంగా బలోపేతమవుతారని పెద వేగిలోని జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంస్థ (ఐఐవోపీఆర్) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ.ప్రసాద్ అన్నారు. పెదవేగి మండలం గార్లమడుగులో ఆదర్శరైతు ఉప్పలపాటి చక్రపాణి పామాయిల్ తోటలో అంతరపంటల సాగు, ఆధునిక, సాంకేతిక విధానంలో యాజమాన్యం అంశాలపై రైతులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ పామాయిల్, కొబ్బరి వంటి దీర్ఘకాలిక పంటల్లో కోకో, మిరియం, వక్క వంటి పంటలు మరింత లాభదాయకమన్నారు. జిల్లా ఉద్యానశాఖాధికారి డాక్టర్ ఎస్.రామ్మోహనరావు, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి పి.రవికుమార్, ఐఐవోపీఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.కాళిదాస్, పెదవేగి మండల ఉద్యానశాఖాధికారిణి కె.రత్నమాల, రైతులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం పరిశీలించిన నూతన ఆర్డీవో

పోలవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలవరం తహసీల్దారు కార్యాలయాన్ని నూతన ఆర్డీవో ఎంవీ రమణ శనివారం పరిశీలించారు. భూ సమస్యలపై తహసీల్దారు సాయిరాజు, సిబ్బందితో ఆమె సమీక్షించారు. డిప్యూటీ తహసీల్దారు కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాలపై అవగాహన

లింగపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ధర్మాజీగూడెం ఎస్‌ఐ కే వెంకన్న అన్నారు. ధర్మాజీగూడెంలో వాహనాల తనిఖీ నిర్వ హించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ద్విచక్రవాహనాలపై పరిమితికి మించి ప్రయాణం చెయ్యకూడదని, హెల్మెట్ ధరించాలని లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

త్రోబాల్ విజేతలు వీరే



ఏలూరు అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు సెయింట్ ఆన్స్ హైస్కూలు క్రీడా మైదానంలో ఈ నెల 22న జరిగిన ఈస్ట్రన్ ఇండి యా స్కూల్, కాలేజ్ లెవల్ స్పోర్ట్స్ మీట్-2024లో త్రోబాల్ పోటీలో ఏలూరు సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాల ప్రథమ స్థానం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుందని ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగల్ తెలిపారు. విజేతల బృందాన్ని ప్రావిన్షియల్ సుపీ రియర్ సిస్టర్ శౌరీలు, ఈస్ట్రన్ ప్రావిన్స్ ఎడ్యు కేషనల్ కౌన్సిలర్ సిస్టర్ రజిత, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఆండాళ్ళు తదితరులు అభినందించారు.

మహిళలకు రుణాలిప్పించాలి

కొయ్యలగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యాలు సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయరాజు అన్నారు. శనివారం కొయ్యలగూడెం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన జంగారెడ్డి గూడెం క్లస్టర్ అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి ద్వారా బ్యాంకు లింకేజీతో మహిళలకు రుణాలు ఇప్పించి యూనిట్లు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సామఖ్య అధ్యక్షురాలు తోట కృపామణి, ఏడు మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి



మాట్లాడుతున్న సుబ్బారాయుడు

జంగారెడ్డిగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అక్కరాయుడు కమిటీ నివేదిక ప్రకారం మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.31,500 ఇవ్వాలని, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరుమళ్ళ సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక లయన్స్ క్లబ్‌హాల్‌లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా సర్వసభ్య సమావేశం సంఘ జిల్లా అధ్యక్షుడు కూరపాముల విజ్ఞేష్ అధ్యక్షతన జరిగింది. సుబ్బారాయుడు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్మికులు అందర్ని పర్మినెంట్ చేయాలని, సమానపనికి సమానవేతనం అమలు చేయాలన్నారు. 2006లో ఈఎస్‌ఐ రూ. 21వేలు ఉందని, దానిని రూ.41వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఉద్యోగ, కార్మిక సమస్యల పై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డిశ్రీనివాస్ గాంగే మాట్లాడారు. సమావేశానికి ముందు పట్టణంలోని మున్సిపల్ కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బజంత్రిశ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జంగారెడ్డిగూడెం గౌరవ అధ్యక్షుడు జంపర వెంకటరమణరాజు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్య ప్రదర్శన

జంగారెడ్డిగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో వేంచేసివున్న మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల సందర్భంగా వేకువ జాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆలయం వద్ద భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కుమారి ఐనవల్లి మంజుశ్రీ కూచిపూడి నృత్యప్రదర్శన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ ప్రదర్శనను తిలకించారు. నిత్యఅన్నదాన సత్రంలో భారీగా హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ చేసినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

కారుణ్య నియామకం

ఏలూరు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఏలూరు సీసీఎస్ ఎస్‌ఐ డి. నరసింహారావు మరణించగా ఆయన కుమారుడికి కారుణ్య నియామకంలో భాగంగా ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోనే జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని ఇస్తూ ఎస్పీ కెపిఎస్ కిషోర్ నియామక పత్రాలను అందించారు. అదనపు ఎస్పీలు సూర్యచంద్రరావు, ఎస్పీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. నరసింహారావు సతీమణి ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

జనవరి 5న హైందవ శంఖారావం

ఏలూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆలయాల రక్షణ కోసం జనవరి 5న విజయవాడలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు ప్రతి హిందువు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ సహప్రాంత ప్రచారక్ జనార్దన్ పిలుపునిచ్చారు. శనివారం ఏలూరులో హైందవ శంఖారావం సన్నాహక సమావేశం జరిగింది. ప్రతి గ్రామం నుంచి హిందువులు తరలివచ్చి శంఖారావాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పలు హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైస్ చైర్మన్‌ను కలసిన సత్యవాడ

ఏలూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన శీతంరాజు సుధాకర్‌ను, రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నీలాయపాలెం విజయ్‌కుమార్‌ను బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనను కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు కె.సతీష్‌శర్మ తదితరులు ఉన్నారు.

ఎయిమ్ రాష్ట్ర నాయకుడు దూబా విల్సన్ మృతి

టి.నరసాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఎయిమ్) రాష్ట్ర దళిత నాయకుడు దూబా విల్సన్ (43) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. టి.నరసాపురానికి చెందిన విల్సన్ అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా పనిచేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి దళిత, ఎయిమ్ నాయకులు సంతాపం తెలిపారు.

ఆది వరాహస్వామికి పూజలు



ప్రవచిస్తున్న చక్రవర్తుల సుబ్బారావు

నిడమర్రు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అడవికొలను గ్రామంలో వేంచేసియున్న శ్రీ వసుంధరా దేవి సమేత ఆది వరాహస్వామి పూజా కార్యక్ర మం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రవర్తుల సుబ్బారావు ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా జరిగిన ప్రవచన కార్యక్రమంలో చక్రవ ర్తుల సుబ్బారావు మాట్లాడుతూ కార్తీక మాసంలో భూ వరాహస్వామి ఆరాధన ద్వారా వ్యవసాయం, మత్స్యసాగు లో ఒడుదిడుకులను అధిగమించ వచ్చని భూ సంబంధ సమస్యల పరిష్కారానికి స్వామి వారి ఆరాధన సత్ఫలితాలు ఇస్తుంద న్నారు. సుమారు 100 జంటలు పాల్గొని పూజలు నిర్వహించారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న మంత్రి పార్థసారథి

పేద ప్రజల ఆరోగ్య భద్రత మాది

మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు, పేద ప్రజలకు పూర్తి ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వానిదని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. టీడీపీ కార్యాలయంలో 15 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం ఆయన అందజేశారు. ఆరోగ్యశ్రీ వర్తించని వ్యాధులకు సంబంధించి బాధితులు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సహాయం అందజేసినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధినుండి ఒక్క చెక్కును కూడా పేద ప్రజలకు అందజేయలేదని విమర్శించారు. పేద ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటి నెరవేస్తున్న ప్రభుత్వం, టీడీపీ కూటమి ప్రభుత్వం అన్నారు. ప్రజలు తమపై నమ్మకంతో అందించిన విజయాన్ని బాధ్యతగా భావిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేసినప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని తప్పనిసరిగా నెరవేరుస్తామన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● చాట్రాయి: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మండలంలోని నరశింహరావుపాలెంకు చెందిన బిలుగుది శిరీషకు రూ 35 వేలు, అల్లు రాఘవరెడ్డికి రూ 42 వేలు మంత్రి పార్థసారథి చెక్కులు అందజేశారు. బొట్టు లక్ష్మణరావు, నేబు లిరెడ్డి, అందే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో విజయంపై బీజేపీ సంబరాలు



చాట్రాయిలో కూటమి శ్రేణులు సంబరాలు

చాట్రాయి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ఘన విజయం సాధించడంపై చాట్రాయి సెంటర్‌లో శనివారం రాత్రి బీజేపీ టీడీపీ జనసేన శ్రేణులు సంబరాలు జరిపారు. నాయకులు కార్యకర్తలు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు, బీజేపీ వర్థిల్లాలి, నరేంద్రమోదీ జిందాబాద్ అని నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులైన అన్ని వర్గాల ప్రజలు బీజేపీపై మొగ్గుచూపుతున్నారనటానికి మహారాష్ట్ర ఫలితాలు నిదర్శనమని, మోదీ పాలనలో భారత్ బలీయమైన శక్తిగా ఎదుగుతున్నదని అన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఓబిళ్ళనేని రాజా, బీజేపీ నాయకులు సంజీవరెడ్డి, ముత్తారెడ్డి, చాగంటి వాసు, బుర్రి శ్రీకర్, టీడీపీ జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డులో దిగబడిన ఆయిల్ ట్యాంకర్



చాట్రాయి సెంటర్‌లో దిగబడిన ఆయిల్ ట్యాంకర్

చాట్రాయి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి సెంటర్‌లో శనివారం ఆయిల్ ట్యాంకర్ దిగబడి ఆగిపోవడంతో సుమారు గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. చాట్రాయి సెంటర్ చాలా ఇరుకుగా ఉంటుంది. పెద్ద వాహనాలు ఎదురుఎదురుగా వస్తే తప్పుకోవడం చాలా కష్టం. ఎదురుగా ఉన్న లారీని దాటుకొని వెళ్లడానికి ట్యాంకర్ డ్రైవర్ రోడ్డు మార్జిన్‌లోకి దిగటంతో అక్కడ నీటి గంట ఉండడంతో దిగబడిపోయింది. కొంతసేపటి తరువాత అటుగా క్రేన్ రావడంతో ఆ ట్యాంకర్‌ను బయటకు తీశారు. ఆయిల్ ట్యాంకర్ అక్కడ నుండి వెళ్లిపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పాఠశాలల పని వేళలు పెంచొద్దు



నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ముసునూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనివేళల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జి.పద్మకిశోర్, ప్రధాన కార్యదర్శి రాంబాబు డిమాండ్ చేశారు. చెక్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల లో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. సాయంత్రం 5 గంటల వరకు పనివేళలను పెంచేందుకు సాగిస్తున్న ప్రక్రియవల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతారన్నారు. పాత పని వేళలనే కొనసాగించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. కార్యక్రమంలో కోశాధికారి నక్కా నారాయణ, కౌన్సిల్ సభ్యురాలు పద్మలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సుంకొల్లులో ర్యాలీ చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

నూజివీడు టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సుంకొల్లు గ్రామంలో శనివారం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సారా, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించడం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీటీడీకి కూరగాయల వితరణ

నూజివీడు టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో నిత్యాన్నదానానికి నూజివీడుకు చెందిన పలువురు భక్తులు శనివారం 12 టన్నుల కూరగాయలను పంపించారు. లారీని దేవరగుంటకు చెందిన నక్క సత్యనారాయణ ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి జెండా ఊపి పంపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

ముసునూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సూరేపల్లిలో ఎక్సైజ్ సిబ్బంది శనివారం సారా విక్రయిస్తున్న చల్లారి ప్రియాంకను అదుపులోకి తీసుకుని 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఆమెను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై మస్తానయ్య తెలిపారు.

మాలల ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలి

నూజివీడు టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు రాజీవ్ సర్కిల్ వద్ద ఈనెల 24న నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాల యోధుల సంక్షేమ సంఘం నాయకులు శనివారం పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్లకు కొందరు తూట్లు పొడిచే కార్యక్రమాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో మాలలంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు దత్తాశ్రమంలో లక్షవత్తుల దీపోత్సవం

మండవల్లి నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దత్తాశ్రమంలో ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు లక్ష వత్తుల దీపోత్సవం, కార్తీక అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దత్తాత్రేయం ఎగ్జిక్యూటివ్ గురజాడ ఉదయశంకర్ తెలిపారు. శివలింగానికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గురజాడ వెల్లడించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ముదినేపల్లి, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని 13 సాగునీటి సంఘాలకు డిసెంబరు 8న జరిగే ఎన్నిక లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సంఘా లకు ఎన్నికలు నిర్వహించే ప్రదేశాలను అధికారులు ఖరారు చేశారు. మండలంలోని కోడూరు, పెదపాలపర్రు, గురజ, దాకరం, పెదగొన్నూరు, బొమ్మినంపాడు, ప్రొద్దువాక, వైవాక, వాడవల్లి, వణుదుర్రు, చేవూరు నీటి సంఘాల పాలకవర్గ ఎన్నికలను ఆయా గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ హైస్కూళ్లలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్.కె.సుభానీ తెలిపారు. పెద తుమ్మిడి సంఘ ఎన్నిక వణుదుర్రు, కోమర్రు నీటి సంఘ ఎన్నిక పెదగొన్నూరులో నిర్వహిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

సెల్ మాయాలోకం



ఆప్యాయంగా పిలిచే మాటలు లేవు. పలకరింపులు అసలే లేవు, పరామర్శలు అంతకంటే లేవు. ఇప్పుడు ఎక్కడ చూసినా మొబైల్ పలకరింపులు. అప్‌డేట్ అంటూ పాత, కొత్తతరం మొబైల్ ఫోన్‌లలోనే మునిగి తేలుతున్నారు. దీనికి చిన్నా పెద్దా, ఆడా మగా తేడా ఏమీ లేదు.. అంతటా సెలఫోన్ రాజ్యమే.. ఇంటి యజమానికి మంచినీరిచ్చే దిక్కులేదు.. పిల్లలకు చదువు చెప్పే తీరిక లేదు.. కాస్త మంచీ చెడూ చెప్పే పెద్దలదీ ఇంచుమించే ఇదే తీరు.. అంతలా సెలఫోన్ మాయాజాలంలో బందీ అయిపోయారు..బంధాలకు దూరమయ్యారు...

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరుకు చెందిన సుబ్బారావు ఇంట్లో ఐదుగురు ఉంటారు. వీరందరి చేతుల్లోనూ తలకో ఫోన్. ఒకరికొకరు ఎదుట పడి మాట్లా డుకోవడం ఎప్పుడో పోయింది. రాత్రి పొద్దుపోయేంత వరకు సెల్ లోనే మునిగి తేలతారు. దీనికోసం వీరంతా ప్రతీనెలా పెట్టే ఖర్చు సుమారు రెండు వేల రూపాయలు. మధ్య తరగతి కుటుంబమైనా ఇంత ఖర్చు భరించాల్సిందే. మధ్యమధ్యలో నెట్ కోసం మరో పదో పరకో తప్పదు.

తాడేపల్లిగూడేనికి చెందిన సుబ్రహ్మణ్యం ఒక చిరుద్యోగి.. చదువు కునే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయనకు ఉద్యోగం కాబట్టి ఫోన్ తప్పదు.. సమాచారం కోసం ఇంటావిడకు కూడా మరో ఫోన్.. వీళ్ల ఫోన్లు ఖాళీ ఉండవు కాబట్టి పిల్లలకోసమని ఇంకో ఫోన్.. ఫోన్లు సరే.. వాటి రీచార్జిలకు నెలనెలా సొమ్ములవుతాయి కదా.. పొద్దస్తమానూ చాకిరీ చేసి ఇంటికొస్తే అంతా సెల్‌ఫోన్లతో యమా బిజీగా ఉంటారు.. కాస్త మంచినీరు ఇచ్చే దిక్కు కూడా లేదని వాపోవడం తప్ప ఏం చేయగలడు..

- సెల్‌ఫోన్ లేనిదే క్షణం గడవదు
- మూకుమ్మడిగా మునిగి తేలుతున్నారు
- ఇంట్లో సమస్యలు ఎవరికీ పట్టవు
- మాటామంతి ఎప్పుడో మాయం
- ఒంటరితనం.. మనోవైకల్యంతో ఇబ్బందులు
- చంటి పిల్లలకు కూడా ఇదే పెద్ద బూచి
- మారుతున్న కాలమంటూ సెల్‌చల్
- డబ్బుపోయే.. సమయం పోయె..

రోజంతా కాయకష్టం చేసిన వారి దగ్గర నుంచి ఇంట్లో ఇల్లాలు వరకు ఇప్పుడు అందరి చేతి లోనూ సెల్‌ఫోన్‌లే. అడుగుతీసి అడుగేయాలంటే ఫోన్ ఉండాల్సిందే.. ఏది కొనాలన్నా, చెప్పాలన్నా, బెదిరించాలన్నా, బామాలాడాలన్నా సెల్ చేతిలో ఉండాల్సిందే. అంతలా సెల్ బానిసలయ్యారు జనం. రోజువారి పనులను కూడా వాయిదా వేసుకుంటున్నారు.చంటి పిల్లలు కూడా ఇప్పుడు మొబైల్ బొమ్మలకు అలవాటుపడ్డారు. చిన్న పిల్లలు మారాం చేస్తుంటే కాస్త గదమాయించాల్సింది పోయి.. వారి చేతుల్లోనే మొబైల్ ఉంచి సరిపుచ్చుకుంటున్నారు. పాడైపోతారంటూ పిల్లలను గదమాయించే పెద్దలంతా 24 గంటలు సెల్ కబుర్లు. ఆచార సంప్రదాయాలు, పలకరింపులు, ధైర్యం చెప్పడం, తప్పు చేస్తుంటే.. తప్పు కన్నా అంటూ సున్నితంగా హెచ్చరించే అలవా ట్లన్నీ క్రమేపీ మారిపోతున్నాయి. ఇది కాస్తా చిన్నప్పటి నుంచే వ్యసనంగా మారుతుంది. రానురాను చదువు, సంధ్య పక్కనపెట్టి సెల్ పుణ్యమా అంటూ కొందరు అసమ్మర్థుల వుతున్నారు. ఈ మధ్యకాలంలో స్కూలు వయసులోనే సెల్ కోసం డిమాండ్ చేయడం పెద్దలపై ఒత్తిడి తెచ్చి మరీ సాధించడం చేస్తున్నారు. పాఠశాలలు ఎగ్గొట్టి కొందరు విద్యార్థులు బయట ప్రాంతాల్లో సెల్‌తో కాలక్షేపం చేస్తున్నారు.ఇలాంటి విపత్కర పరిస్థితి నుంచి పిల్లలను బయట పడేద్దామనుకుంటున్న తల్లిదండ్రులకు అది సాధ్యం కావడం లేదు. అంతలా సెల్ మయమైంది.

కోరి తెచ్చుకున్న ఒంటరితనం

ఈ మధ్యకాలంలో సెల్‌ఫోన్ చేసే గాయాలు అన్నీ ఇన్నీ కావు. లోతుగా గమనిస్తే చాలా మంది నలుగురితో కలవడం మానేశారు. యోగక్షేమాలు అడగడం ఏనాడో మరిచిపోయారు. కనీసం కుటుంబ నేపథ్యం గురించి, బాగోగులు గురించి ఏ ఒక్కరూ పట్టించుకోకపోగా హాయ్ అంటూనే పక్కకు జరిగిపోతున్నారు. చాటింగ్‌లు, వీడియో రీల్స్, అనవసర విషయాల్లో చర్చలు, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల్లో ప్రమోట్ అయ్యేందుకే ఇష్టపడుతున్నారు. మంచి, చెడ్డ ఇక్కడ ప్రస్తావనే లేదు. ఉదాహరణకు ఇంటికి ఎవరైనా చుట్టాలు వచ్చినా చూద్దామని స్నేహి తులు వచ్చినా దూర ప్రాంతాల నుంచి అయిన వారు వచ్చినా కనీసం వారితో పలకరింపులు కరువే. ఎప్పుడొచ్చారనే అనే ముక్తసరి ప్రశ్నతోనే సరిపెట్టేస్తున్నారు. అంతకంటే మించి వారితో కూర్చొని మాట్లాడేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. ఎవరినైనా పరామర్శించాలన్నా వీడియో కాల్స్‌లో సరిపెట్టేస్తున్నారు. అంతలా సెల్ భూతం అందరినీ ఆవరించింది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైన వేళ ఒకరిద్దరి సంతానంతో సరి పెట్టుకుంటున్న తల్లిదండ్రులకు ఈ తరహా పరిణామాలన్నీ ఏ మాత్రం రుచించకపోగా వారికి చేదు అనుభవాలను మిగు లుస్తున్నాయి. ఇంటి యజమాని తీరిక లేకుండా విపరీతమైన ఒత్తిడితో ఉంటుండగా దీనికి విరుద్ధంగా ఇంట్లో మిగతా వారంతా సెల్ హల్ చేస్తున్నారు. ఖర్చుతో పాటు ఇంట్లో గొడవలకు ఇదే కారణమవుతోంది.

కంటి చూపు కరువే

విపరీతంగా సెల్‌ఫోన్ వినియోగిస్తున్న వారిలో అనేక రుగ్మతలు బయటపడుతున్నా వీటికి దూరంగా ఉండడానికి ఏ మాత్రం ఇష్టపడడం లేదు. కేవలం సమాచారం, ఎక్కడికక్కడ పరస్పర సహకారం నిమిత్తం ఉపయోగ ఎడాల్సిన సెల్ ఫోన్‌ల వాడకం విపరీతం కావడంతో అంతే వేగంగా రుగ్మతలు వచ్చిపడుతున్నాయి. రోజువారి నిరంతరం సెల్‌లో మునిగి తేలేవారిలో అత్యధికులకు ఈ మధ్యన చత్వారం వచ్చిపడుతోంది. వయసుతో నిమిత్తం లేకుండా రెండు కళ్ళు కాస్తా నాలుగు కళ్ళవుతున్నాయి. దీనికితోడు మానసిక రుగ్మతలు తోడవుతున్నాయి. అనవసరంగా ఆవేశపడడం, తమకంతా తెలిసినట్టుగా విర్ర వీగడం, కారణం లేకుండా రెచ్చిపోవడం వంటి దుష్పరిణామాలు కొందరిలో కనిపిస్తున్నాయి.ఇవి మనిషి వ్యక్తిత్వాన్ని మార్చేస్తు న్నాయి. ఫలితంగా మిత్రత్వం దూరమై శతృత్వం పెరుగుతూ వస్తుంది. ఎదుటి వారిని వ్యక్తిగతంగా దూషించడం, అప్రదిష్టపాల్జేయడం, నిందించడం, సవాల్ చేయడానికి అంతా సెల్ వేదికవుతుంది. అన్ని కుటుంబాల్లోను అశాంతికి దారితీస్తున్నది. అత్యధికులు మానసిక స్థైర్యం కోల్పోయి ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. తెల్లవార్లూ ఒంటరిగా సెల్‌లో యాప్‌లు మార్చి మార్చి గమనించడం, తద్వారా నిద్రలేమితో విహీనులుకావడం ఈ మధ్యన అందరిలోనూ కనిపిస్తుంది. ఆడ, మగ తేడా లేకుండా, వయస్సుతో నిమిత్తం లేకుండా ఇలాంటి పరిస్థితులు తాండవిస్తున్నాయి.

అవసరం మేరకే వాడండి

మారుతున్న రోజుల్లో అవసరాలు పెరుగుతున్నాయి. ఇప్పుడు మొబైల్ లేకుంటే అత్యంత కష్టం. జీవితంలో మూడో వంతు భాగమైంది. అదీ ఉద్యోగమైనా, వ్యాపారం అయినా, ఇతరత్రా వ్యవహారమైనా సరే మొబైల్ లేకుంటే గడవనే గడవదు. కేవలం ఉన్నంతలోనే అవసరాలకు వాడుకోవడం, ఆ తరువాత దూరంగా ఉంచాల్సిన పరిస్థితులు ఇప్పుడు అందరి ఎదుట సవాల్‌గా మిగిలాయి. ఈ పరిస్థితి నుంచి తమంతట తాముగా బయటపడడం అందరూ అవర్చు కోవాలి. ఏ కాలంలో చేయాల్సిన పని ఆ కాలం లోనే చేసే విధంగా సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలి.

స్లోపాయిజన్ : నాగమణి యాదవ్



స్మార్ట్ ఫోన్ మనిషి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. స్లోపాయిజన్‌గా మారి పోయింది. ఆరోగ్యంతో పాటు మానవ సంబంధాలను దెబ్బ తీస్తోంది. గంటల తరబడి వినియోగిస్తూ అత్యధికులు సెల్ బానిసలవుతున్నారు. అతి వినియోగం అనర్థానికి దారితీస్తుంది. ఈ విషయాన్ని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిర్ధారించింది. సెల్ వినియోగంలో మార్పు రాకపోతే అటు ఆర్థికంగాను, ఇటు వ్యక్తిత్వ పరంగాను దెబ్బతినాల్సిందే.

ఇదే ప్రపంచం : వెలిశిల రామకృష్ణ



సెల్‌ఫోన్ ద్వారా ఒంటరి జీవితానికి అలవాటుపడుతున్నారు. అనవసర విషయా లకు, గేమ్స్‌కే సమయం ఇస్తున్నారు. ఆఖరుకి ఇంట్లో వారితో కూడా మాట్లాడే తీరిక లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. రోజులు మారుతున్నట్టే మనం కూడా మారాలి. కాని ఇది కాస్తా వ్యసనంగా మారకూడదు. వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్లు జీవితం కాదనే విషయం అందరూ గుర్తు పెట్టుకోవాలి.



సెల్‌ఫోన్ చేతిలో ఉండాల్సిందే..

ఆస్తి వివాదంలో తల్లీకుమారుడి హత్య

» జంట హత్యలతో ఉలిక్కిపడిన గన్నవరం

మండవల్లి నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం గన్నవరంలో శుక్రవారం రాత్రి తల్లి, కొడుకు దారుణ హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని దుండగులు కత్తితో గొంతు కోసి హత్య చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన రొయ్యురు భ్రమరాంబ (60), ఆమె కుమారుడు సురేష్ (35) శనివారం వేకువజామున తమ నివాసం వద్ద విగతజీవులుగా పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు మండవల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రామచంద్రరావు, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ రవి కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. పోలీసు జాగిలాలను రప్పించగా అవి గ్రామంలోని పలు ప్రాంతాల్లో కలియదిరిగాయి. డీఎస్పీ మాట్లాడుతూ శుక్రవారం అర్ధరాత్రి గొంతును కత్తితో కోసి దుండుగులు హత్య చేసినట్టు గుర్తించామన్నారు. సమీప బంధువులతో ఆస్తి తగాదాలే హత్యకు కారణమని అనుమానిస్తున్నట్టు తెలిపారు. పంచనామా అనంతరం మృతదేహాలను కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భ్రమరాంబ.. సురేష్ (ఫైల్)

సురేష్‌కు వివాహం కాగా భార్య, కుమార్తె ఉన్నారు. వీరిద్దరూ ఊరెళ్లారు. ఇంట్లో తల్లి, కుమారుడు మాత్రమే ఉండడం గమనించి పక్కా ప్లానింగ్‌తోనే దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. కాగా జంట హత్యలతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెయ్యేరు చెరువు ప్రక్షాళనకు చర్యలు

ముదినేపల్లి, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): పెయ్యేరులోని మంచినీటి చెరువులో కలుషితమైన నీటిని బయటకు తోడించేం దుకు అధికారులు చర్యలు చేపట్టారు. 'పెయ్యేరు మంచినీటి చెరువు కలుషితం' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు స్పందించిన డీపీవో కె.అనురాధ ఆ చెరువులో నీటిని తోడించి, బాగు చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈవో పీఆర్డీ అశోక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణారావు చెరువును పరిశీలించి రంగు మారి కలుషితమైన నీటిని తోడించాలని నిర్ణయిం చారు. చెరువులో ఉన్న చేపలను పట్టుకునేం దుకు వేలం నిర్వహించేందుకు చర్యలు తీసు కుంటున్నట్టు కార్యదర్శి రమేష్ తెలిపారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

కలిదిండి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెదపుట్లపూడిలో 27 అడుగుల భారీ అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా నిర్వహించారు. కైకలూరు, నర్సాపురం ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్‌లు సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, సర్పంచ్ మోకా లక్ష్మీరామకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కలిదిండి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కలిదిండిలో శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు అధ్యక్షతన టీడీపీ మండల సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో జరగాల్సిన అభివృద్ధి పనులు సమస్యలపై చర్చించారు. సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇటీవల వివిధ కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా నియమితులైన కొడాలి వినోద్, అంద్రాజు శ్రీనివాస్, లంకా రత్నారావులను సత్కరించారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, చేపల రైతు సంఘ అధ్యక్షుడు తాడినాడ బాబు తదితరులు పాల్గొన్నారు.

నాపై కార్యదర్శి అసత్యపు ఆరోపణలు..

కైకలూరు సర్పంచ్ నవరత్నకుమారి



కైకలూరు, నవం బరు 23 (ఆంధ్రజ్యోతి): అసత్యపు ప్రచారా లు చేసి తనను అల్లరిపాలు చేస్తున్నారని కైకలూరు సర్పంచ్ డీఎం నవరత్నకుమారి అన్నారు. పంచాయతీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల బదిలీపై కార్య దర్శిగా వచ్చిన ఆనందభూషణం గ్రామం లోని కొందరితో కలసి తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. గతంలో పని చేసిన కార్యదర్శులు సైతం తనతో పాటు ఒకే రూంలో కూర్చొని విధులు నిర్వహించే వారన్నారు. బదిలీపై వచ్చిన ఆయన కొద్ది రోజుల్లోనే కుళాయిలు, ఇంటిపన్నుల విష యంలో కార్యదర్శి ఆనందభూషణం అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.

కొండంగిని సందర్శించిన విదేశీ బృందం



రొయ్యలను పరిశీలిస్తున్న విదేశీ బృంద సభ్యులు

కలిదిండి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ ఎన్విరాల్‌మెంటల్ ఫెసిలిటీగా ఎంపిక చేసిన కొండంగి గ్రామాన్ని విదేశీ బృందం మత్స్యశాఖ ఉన్నతాధికారులతో కలసి శనివారం సందర్శించి ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తున్న ఆక్వా కల్చర్‌ను అధ్యయనం చేశారు. పండుగప్ప సాగు చేస్తున్న రైతులను, వనామి సాగు చేస్తున్న రైతులను కలసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మత్స్యశాఖ మిషనర్ డోలా శంకర్, జేడీ లాల్ మహమ్మద్, అడిషనల్ డైరెక్టర్ అంజలి, జిల్లా మత్స్యశాఖాధికారి నాగ లింగాచార్యులు, ఏడీ రాజ్ కుమార్, ఎఫ్‌డీవో రవి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ

ముదినేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న మినుముల విత్తనాలను రైతులు సద్వినియోగించుకోవాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు కోరారు. చిగురుకోట రైతు సేవా కేంద్రంలో శనివారం వీబీఎన్-8 రకం మినుము విత్తనాలను రైతులకు అందజేశారు.



తన భార్య పేరుపై టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని ఎంపీ నుంచి తీసుకుంటున్న బీకేఎం నాని

టీడీపీ శాశ్వత సభ్యత్వం

కైకలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని ఆ పార్టీ కైకలూరు కోకన్వీనర్ బొమ్మనబోయిన విజయలక్ష్మీ తీసుకున్నారు. ఏలూరులో ఎంపీ మహేశ్ సమక్షంలో విజయ లక్ష్మీ భర్త అయిన బీకెఎం నాని రూ.లక్ష కట్టి భార్య పేరు మీద సభ్యత్వాన్ని తీసుకున్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

కలిదిండి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మట్టగుంటలో తాగునీటి చెరువును ఎండగట్టడంతో సర్పంచ్ అంద్రాజు రత్నమణి ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్ల ద్వారా గ్రామ స్థులకు తాగునీటి సరఫరా చేస్తున్నారు. తాగునీటి చెరువును తాజా నీటితో నింపే వరకు వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని సర్పంచ్ తెలిపారు.